

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :15 సంచిక: 03 హైదరాబాద్ 2015 జూలై పేజీలు 40

Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-

# మెహెరస్థాన్ ధర్మశాల 10వ వార్షికోత్సవం

మెహెర్‌స్థాన్ ధర్మశాల 10వ వార్షికోత్సవం 2015 ఆగస్టు 9న నిర్వహిస్తున్నట్లు, మెహెరాబాద్ నుండి పలువురు బాబా ట్రస్టు సభ్యులు హాజరువుతున్నారని బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనవల్సిందిగా శ్రీ వై. శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు.

**గోదావరి పుష్కరాలు**

**గోదావరి పుష్కరాలు** సందర్భంగా 2015 జూలై 12 -25 దాకా మెహెర్‌స్థాన్ ధర్మశాలకు విచ్చేసే బాబా ప్రేమికులకు తగిన భోజన బస ఏర్పాటు చేసినట్లు శ్రీ వై. శ్రీనివాస్ (99121 99978, 088132 34312) ఒక ప్రకటనలో తెలిపారు.

# చల్లపల్లి సెంటర్ స్వర్ణోత్సవాలు

చల్లపల్లి బాబా సెంటర్ స్వర్ణోత్సవాలు 2015 ఆగస్టు 29, 30 తేదీలలో ఘనంగా నిర్వహించనున్నామని కార్యదర్శి శ్రీ పి.వి. రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలలో భాగంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రసంగించదల్చిన వక్తలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనగోరువారు తమ వివరాలు ఆగస్టు10లోగా పంపవల్సిందిగా ఆయన కోరుతున్నారు.

ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిధులుగా మెహెరాబాద్ నుంచి చైర్మన్, బాబా ట్రస్టు శ్రీ శ్రీధర్ కేల్కర్, శ్రీ జాల్ పి. దస్తూర్, శ్రీమతి డాలీ దస్తూర్, తదితరులు పాల్గొంటున్నారు. శ్రీ బి. రామక్రిష్ణయ్య, శ్రీ యస్వీ ప్రసాద రాజు, సహవాస్ కార్యక్రమాలను నిర్వహిస్తారు. బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనవల్సిందిగా కోరుతున్నారు. మరిన్ని వివరాలకు (99636 58859) సంప్రదించగలరు.



# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్ నామ వ్యాప్తికి మీ బంధుమిత్రులలో కనీసం ఒకరిద్దరినైనా ప్రోత్సహించి పత్రిక వార్షిక లేక జీవిత సభ్యత్వం చెల్లింపజేయండి. పత్రిక పది వేల సైన్యంతో సమానమని గమనించగలరు. మరిన్ని వివరాలకు ఎడిటర్, మెహెర్‌బాబా, **995 955 3218**ని సంప్రదించగలరు.

## బాబా సందేశం

మీ కోరికలు నెరవాలని నన్ను కోరవద్దు. నేను మీ నుండి ఏమి ఆశిస్తున్నానో అది నెరవారలని మీరు కోరుకోండి. ఏ కోరిక లేని జీవనం ప్రసాదించమని కోరుకోండి!!

**Instead of wanting Me to want what you want,**
**want what I want.**
**Desire for Desirelessness.**

**- మెహెర్‌బాబా**

**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**040-6555 3218**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
**040-65699611**

## లోపలి పేజీలలో...

1. సంపాదకీయం 5
2. అబ్దుల్లా పక్రవాన్ (చోటా బాబా)6-16
3. కరీం బాబా 17-19
4. లార్డ్ మెహెర్ 20-29
5. శ్రీమతి సీతామహాలక్ష్మి 30
6. హిందీ సహవాస్ 31-36
7. మౌనంలో మెహెరాబాద్ 37
10. ప్రార్థనలు 38-39

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

**మనవి**

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# బొబ్బిలి కేంద్రం 24వ వార్షికోత్సవం

## ఆగస్టు 9న ఉదయం 6 నుండి

అవతార్ మెహెర్‌బాబా బొబ్బిలి కేంద్రం 24వ వార్షికోత్సవం ఆగస్టు 9న ఉదయం 6 నుండి నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీ జల్లు వెంకట మెహెర్, అధ్యక్షులు శ్రీ పంతరాం శ్రీరాంమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.
ఈ కార్యక్రమంలో శ్రీ కాకుమాను మెహెర్ వెంకట్, మాధవీ లత, శ్రీ ఆర్.ఎమ్. రాజు. తదితరులు బాబా సందేశాలపై ప్రసంగిస్తారని, బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో హాజరుకావల్సిందిగా కార్యదర్శి తెలిపారు.
**మరిన్ని వివరాలకు కార్యదర్శి 9440345356 సంప్రదించగలరు.**

---

# రచనలకు ఆహ్వానం

బాబా సందేశాలపై, మీకు నచ్చిన అంశాలపై మీ రచనలకు ఆహ్వానిస్తున్నాం.
మీ ప్రాంతాల్లో జరిగే సహవాస్ కార్యక్రమ వివరాలను కూడా మా చిరునామాకు పంపండి.
మీ సమాచారం మాకు ప్రతి నెలా 5వ తేదీ లోగా మాకు అందేలాగా పంపవల్సింది.

**మా చిరునామా..**
ఎడిటర్, బాబాస్ హౌస్, గోదావరి గార్డెన్స్,
ప్లాట్ నంబరు 32, యాప్రాల్,
సికింద్రాబాద్ - 500 087. ఫోన్ 99595 53218.
**ఇ-మెయిల్.** malladisukku@gmail.com.

---

## హెల్ప్‌లైన్

ప్రతి నెలా 25లోగా మెహెర్‌బాబా పత్రిక పోస్టులో మీకు అందేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. ఐతే, ఏ కారణంగానో నెల చివరిదాకా కూడా పత్రిక పోస్టులో మీకు రాకుంటే హైదరాబాద్ బాబా ప్రేమికులు శ్రీ వి.ఆర్.కె.శాస్త్రి (98492 42284), శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు. **మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపితే పత్రికను నెట్‌లో పంపగలము.**

# సంపాదకీయం మౌన వార్షికోత్సవం

అవతారుని 90వ మౌన వార్షికోత్సవం ఘనంగా ముగిసింది.
తెలుగువారు చాలామంది జూలై 10న మౌనం పాటించారు.
నోరు మెదపకుండా మౌనం పాటించడం పరిపాటి.
కానీ, మనస్సును కట్టడి చేయకుండా మౌనం పాటించడం ఎలా సాధ్యం?
లిప్తపాటు కాలంలో ఎన్నో వేల మైళ్ళు మనస్సు ప్రయాణిస్తుంది.
12 సెకండ్లు మనస్సును కంట్రోలు చేయగలిగితే
ఆధ్యాత్మికపథంలో ముందంజలో వున్నట్లేనని బాబా అన్నారు.
ఈ మేరకు జూలై 10న ఏ మేరకు మౌనం పాటించారో
ఎవరికివారు, వ్యక్తిగతంగా వారి అంచనాలు, బేరీజు వేసుకోవడం సముచితం!!

***

మీ మనస్సు కొన్ని వేల ఆలోచనలతో నిండి వుందన్నారు బాబా తన సందేశంలో!!
మీరేది ఊహించినా అది మీ మనస్సుతోటే చేస్తారు.
మనస్సులో కొన్ని వేల ఆలోచనలు ఎలా ఉద్భవిస్తున్నాయో మీకు తెలుసా? అని బాబా ప్రశ్నిస్తూ, మీకు తెలియకుండానే ఆ ఆలోచనలు వచ్చిపడుతుంటాయి.
మీరు తీసుకునే శ్వాస మీకు తెలియకుండానే జరుగుతోంది.
అనుక్షణం ఊపిరి పీల్చుకుంటున్నారు.
గాలి లోపలికి పోతుంది. బయటకు వస్తుంది.
ఉచ్ఛ్వాసనిస్వాసలు మీ అనుమతి లేకుండా సహజ రీతిలో జరుగుతోంది.
భగవంతుడు మీ శ్వాస కన్నా దగ్గరగా వున్నాడు.
అయితే, అది మీకు తెలియదు. అది గమనించమన్నారు.
ప్రతి ఒక్కరూ భగవంతుని ప్రేమికునిగా మారాలి.
అది చెప్పినంత సుళువైనది కాదు. ఎంతో కష్టంతో కూడినది.
ఐతే, భగవంతుని ప్రేమికునిగా కావాలంటే, **భగవంతుని పాదధూళిగా ప్రేమికుడు మారాలన్నాడు హాఫీజు. భగవంతుని పాదధూళిగా మారిన సుమారు లక్ష మందిలో ఏ ఒక్కడో,** ఒకేఒక్కడు విజయం సాధించగల్గుతాడు. మిగిలినవారు ఎందుకు విజయం సాధించలేరు? అదెందుకు అసాధ్యం? అని ప్రశ్నిస్తే,
అందుకు మీకు మీరే నిందులని, మీ మనస్సులో అసంఖ్యాకమైన
ఆలోచనలతో నిండి వుండటమేనని బాబా తన ప్రవచనంలో అన్నారు!!
మనస్సు కట్టడికి, నిరంతర బాబా నామస్మరణే చక్కని దివ్యౌషధం!!

# అబ్దుల్లా పక్రవాన్

**-శ్రీ నోరి సూర్యనారాయణ,** కోఠి సెంటర్.

**అవతారుడు** తనకు కావల్సినవారిని స్వయంగా ఎంచుకుంటాడు. ఇది పాఠకులందరికీ తెలుసు. ఆ కోవకు చెందినవాడే **అబ్దుల్లా పక్రవాన్.** 1927 ప్రాంతంలో అబ్దుల్లా పక్రవాన్ హజరత్ బాబాజాన్ స్కూల్లో చదువుకున్న విద్యార్థి. చదువు కోసం ఇరాన్ నుండి మెహెరాబాద్‌కు వచ్చాడు. ఆనాడు హజ్రత్ బాబాజాన్ స్కూల్‌లో బాబావారి సమక్షంలో చదువుకున్న 120 మంది విద్యార్థులలో అబ్దుల్లా చురుకైనవాడుగా వున్నాడు. బాబావారి నామస్మరణతో తరించిన అబ్దుల్లా అనతికాలంలోనే ఆరవ భూమికను చేరుకున్నాడు. బాబా ఇతడిని **ఛోటా బాబా** అని పిలిచారు. 1930వ దశకంలో బాబా ఇరాన్‌కి వెళ్ళారు. బాబాతోపాటు ఇరాన్ వెళ్ళిన అబ్దుల్లా తిరిగి మెహెరాబాద్‌కు రాలేదు. అక్కడే స్థిరపడ్డాడు. ఆ దరిమిలా, సుమారు నాలుగున్నర దశాబ్దాల తర్వాత, 1975లో బాబా ప్రేమికులు Irwin Luck and Dr. Farhad Shafa, బందర్ అబ్బాస్, ఇరాన్‌లో అబ్దుల్లాను కలిసారు. మెహెర్‌బాబా సాంగత్యంలో ఆరవ భూమికకు చేరిన అబ్దుల్లా, తన బాల్యం నుండి మెహెరాశ్రమం నిష్క్రమణ దాకా తన జీవితంలో జరిగిన ప్రతి చిన్న విషయాన్ని కూలంకషంగా ఇర్విన్ లక్, డాక్టర్ ఫర్‌హాద్ షఫాలతో ముచ్చటించాడు. వీరు అబ్దుల్లాతో జరిపిన ఇంటర్వ్యూను **రమ్జూ అబ్దుల్లా డైరీ గ్రంథంలో** చివరి పేజీల్లో సప్లిమెంటరీగా ప్రచురించారు. కాగా, ఆ ప్రతుల కాపీని మాకు శ్రీ నోరి సూర్యనారాయణ, కోఠి సెంటర్ ప్రచురణార్థం ఇచ్చారు. అరుదైన అబ్దుల్లా జీవన కథనంలోని అనేక ఆసక్తికర ముఖ్యాంశాలు మరుగున పడిపోకుండా, తెలుగు మెహెర్‌బాబా పాఠకులందరికీ ఒక ప్రత్యేక శీర్షికగా అందజేసే ప్రయత్నం చేశాం. దయచేసి పరిశీలించండి. మీ స్పందన తెలియజేయగలరు.

**ఇకపై, అబ్దుల్లా పక్రవాన్ మాటల్లోనే తదుపరి అంశాన్ని పరిశీలించండి - ఎడిటర్..**

*** ***

**నా పేరు అబ్దుల్లా.** 1909లో రంజాన్ మాసం చివరి రోజుల్లో, ఇరాన్‌లోని బస్తక్ నగరంలో జన్మించాను. మా అన్నయ్య మహ్మద్ పెళ్ళి జరుగుతుంటే, ఆ సందడిలో, మా నాన్న పెద్ద గొంతుకతో ఒక మంచి కొడుకుకి తండ్రిని కావాలనుందని గట్టిగా అరచాడట. మా నాన్న వయస్సు అప్పటికే 80 సంవత్సరాల పైబడింది. ఆ వయస్సులో కొడుకుని కనాలని ఉందా? అని పెళ్ళికొచ్చిన పెద్దలందరూ ముక్కున వేలేసుకున్నారు. అవును!! నాకు అబ్దుల్లా లాంటి కొడుకు కావాలి!! అని తిరిగి గట్టిగా అన్నాడు. అంతేకాదు, తాను ఇటీవల ఒక కలగన్నానన్నాడు.



ఆ కలలో తెల్లని పొడవాటి దుస్తులను, పొడవాటి జుట్టుతో దగ ధగా మెరిసిపోతూ ప్రకాశవంతమైన ముఖవర్చస్సుతో వున్న ఒక సాధువు కలలో కనిపించి తనకు ఒక కుమారుడు జన్మిస్తాడని, అతగాడు తన ఆశ్రమంలో చదువుకుంటాడని చెప్పాడన్నారు. అతనికి **అబ్దుల్లా** అని పేరు పెట్టమన్నాడు. **అబ్దుల్లా అంటే భగవంతుడికి సర్వస్వం అర్పించుకున్నవాడు** అని తెలుగులో సమానార్థంగా చెప్పొచ్చు. ఇలా ఒక సంవత్సరం గడిచింది. జరిగినదంతా అందరూ మర్చిపోయారు. ఆ సమయంలోనే నేను పుట్టాను.

నేను పుట్టిన కొద్దిరోజులకే నా తల్లిదండ్రులు ఇద్దరూ ఒకరు తర్వాత ఒకరు వార్ధక్యంతో కన్నుమూశారు. వాళ్ళు బ్రతికివున్నంత వరకూ నాకు అన్ని విధాలా బాగానే వుంది. ఆ తర్వాత నా కష్టాలు మొదలయ్యాయి. అతి చిన్న వయస్సులోనే నా అనేవాళ్ళు లేక అనాథనయ్యాను. బంధుమిత్రుల సహాయంతో వాళ్ళు పెట్టింది తింటూ – తిరుగుతూ పెరిగాను. 10 సంవత్సరాల వయస్సు వచ్చాక ఉపాధి కోసం అనేక చిన్నా చితకా పనులు చేశాను. నాగలి పట్టి వ్యవసాయం చేశాను. తోటపని, పశువుల కాపరిగా ఇలా అనేక పనులు చేశాను. సంతోషంగా గడిపాను. చదువు విషయానికి వచ్చేసరికి సాంప్రదాయ ముస్లిం స్కూలు – **మదర్‌సాలో** చేరాను. కాని పెద్ద చదువులు చదవాలని ఆశ ఉండింది. మదర్‌సాలని వదిలిపెట్టి 1919లో మా అన్న గారు వుంటున్న **లింగే పట్టణానికి** వెళ్ళాను. అక్కడ ఒక మంచి స్కూల్లో చేరాను. చదువు మీద వున్న ధ్యాస వల్ల స్కూల్లో చెప్పిందే కాకుండా ఇంటి దగ్గర కూడా కష్టపడ్డాను. స్కూల్లో పర్షియన్, అరబిక్, ఇంగ్లీషు, లెక్కలు చెప్పేవారు. పరీక్షల్లో మంచి మార్కులు వచ్చాయి. నా టీచర్లు నన్ను చూసి సంతోషించేవారు. కొద్ది రోజుల్లోనే నన్ను ఫస్టు గ్రేడు నుండి రెండో గ్రేడు ఆ తర్వాత మూడో గ్రేడుకి ప్రమోట్ చేశారు. చదువుకునే రోజుల్లో నేను చాలా సన్నగా పీలగా ఉండేవాడిని. తరచూ నేను ఏదో ఒక నలతతో ఇబ్బందిపడేవాడిని. ఈ అనారోగ్యంతో చదువుకి అప్పుడప్పుడు అంతరాయం కలిగింది. అయినప్పటికీ 1923 నాటికి ఎలిమెంటరీ స్కూలు డిప్లొమా సాధించాను. ఆ తర్వాత ఒక వ్యాపారి దగ్గర చిన్న ఉద్యోగంలో చేరాను. నెలకు పది రూపాయిలు జీతం ఇచ్చారు. 6 నెలలు తర్వాత ఆ ఉద్యోగం మానేశాను. దుబాయి వెళ్ళాను. అక్కడ మరో ఉద్యోగంలో నెలకు 25 రూపాయిలు జీతానికి కుదిరాను. ఇక్కడ ఎక్కువ రోజులు ఉండలేక, తిరిగి లింగే పట్టణానికి చేరాను. ఇక్కడ నిరుద్యోగిగా సుమారు నెలరోజులు ఉన్నాను. నేను చదువుకున్న ఎలిమెంటరీ స్కూల్లోనే టీచరు ఉద్యోగానికి దరఖాస్తు చేశాను. అక్కడ ఒకటి, రెండు, మూడు గ్రేడు తరగతుల

పిల్లలకు పాఠాలు చెప్పాను. రేపటి పౌరులుగా తీర్చిదిద్దేందుకు నా శాయశక్తులా కృషిచేశాను. ఆ చిన్నారి పిల్లలకు ఏదో రీతిని సహాయపడాలని నా మనస్సు ఆరాట పడేది. డబ్బు మీద ఆపేక్ష తగ్గింది. ఆ స్కూలు ఆర్థికంగా దెబ్బతిన్న రోజుల్లో జీతం కూడా తీసుకోకుండా చాలాకాలం పిల్లలకు పాఠాలు నేర్పాను. ఇదిలా వుండగా ఆ రోజుల్లో కొంతమంది తల్లిదండ్రులు నేను నాస్తికుడినని, భగవంతుడంటే నమ్మనని, ఏ మతానికి చెందనివాడినని విమర్శించారు. నా క్లాస్ రూంలో ముస్లిం ప్రార్థనలు చేయించేవాడిని కాదు. నా హెయిర్ కటింగ్ కూడా ఇంగ్లీషువారి తీరున వుండేది. ఎవరే విధంగా నన్ను విమర్శించినా నేను నా హృదయంలో భగవంతుడ్ని ఆరాధించేవాడిని. నా హృదయమే నా దేవాలయంగా భావించేవాడిని. భగవంతుడే నా మతం. నా నమ్మకమే నా భగవంతుడు. నేను సత్యాన్వేషకుడిని.

**ఓ భగవంతుడా "నువ్వు త్రికాలవేదివి. నీవు సత్య జ్ఞాన సంపన్నుడివి",** కాబట్టి నన్ను సన్మార్గంలో నడిపించే గురువుని చూపించమని నేను భగవంతుడిని ఎప్పుడూ ప్రార్థిస్తుండేవాడిని. ఏనాటికైనా భగవంతుడు నా మొర ఆలకిస్తాడన్న నమ్మకం నాకుండింది.

## భారతదేశ పర్యటన:

ఒక రోజున కలకత్తా నుండి పబ్లిషవుతున్న దినపత్రికలో ఒక వార్తను నేను చూశాను. అదేమంటే, అహ్మద్‌నగర్ సమీపంలో మెహెరాశ్రమం అనే స్కూలుని త్వరలో ప్రారంభిస్తున్నట్లు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వుంది. ఆ ప్రకటన చూస్తూనే ఆ స్కూల్లో తక్షణం చేరాలనుకున్నాను. అలాగే నా టీచరు నౌకరీకి వెంటనే రాజీనామా చేశాను. ఉద్యోగం నుండి నన్ను రిలీవ్ చేయమని కోరుకున్నాను. అహ్మద్‌నగర్‌లోని స్కూలు ప్రిన్సిపాల్‌కి నా అభ్యర్థిత్వం వివరాలు తెలియజేస్తూ లేఖ రాశాను. వారి నుండి నాకు అనుకూలమైన జవాబు వచ్చింది.

వెంటనే ముంబాయికి ప్రయాణమయ్యాను. అప్పటికే నా ప్రయాణానికి అవసరమైన పాస్‌పోర్టు, వైద్య సర్టిఫికెట్‌లు ఇతరత్రా సిద్ధంగా వుంచుకున్నాను. ఓడలో ఎనిమిది రోజులు ప్రయాణం. 1927 ఆగస్టు 3వ తేదీన ముంబాయి పట్టణానికి చేరుకున్నాను. ముంబాయిలో 4 రోజులు ఉండి ఆ తర్వాత అహ్మర్‌నగర్‌కి బయల్దేరాను.

నేను భారతదేశానికి రావడం ఇదే మొదటిసారి. అహ్మద్‌నగర్ నుంచి మెహెరాబాద్‌కి చేరుకున్నాను. తిన్నగా మెహెరాబాద్ కొండమీదకి వెళ్ళి, మెహెరాశ్రమం ప్రిన్సిపాల్‌ని కలిశాను. ఆనాడు మెహెరాశ్రమం ప్రిన్సిపాల్‌గా సోదరుడు బెహెరంజీ వున్నాడు. ఈయననే బాబా మారుపేరుతో బువాసాహెబ్‌గా పిలిచేవారు. ప్రిన్సిపాల్‌తో మాట్లాడటం పూర్తయిన తర్వాత దిగువ మెహెరాబాద్‌కు ఒక వ్యక్తినిచ్చి పంపారు. ఆయన పేరు

రుస్తుం. రుస్తుం నన్ను దిగువ మెహెరాబాద్‌లో ఒక గది దగ్గరకు తీసుకెళ్ళాడు. కాళ్ళకున్న చెప్పులను వదిలి గదిలోకి రమ్మన్నారు. గదిలోకి వెళ్ళగానే గులాబి రంగులో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న ఒక గొప్ప వ్యక్తి వున్నాడు. తొలి పరిచయంలోనే ఆయన నా మనస్సు దోచుకున్నాడు. నన్ను నా చదువు గురించి, లెఖ్ఖల్లో నాకున్న పరిజ్ఞానాన్ని ప్రశ్నించి ఆయన తిరిగి రుస్తుంతో ఎగువ మెహెరాబాద్‌లో వున్న మెహెరాశ్రమంకు పంపారు. మెహెరాశ్రమంలో వున్న పిల్లలతో నన్ను నేను పరిచయం చేసుకున్నాను. అక్కడ జరుగుతున్న తరగతుల గురించి అడిగి తెలుసుకున్నాను. దూర ప్రయాణం వల్ల బాగా అలసిపోయి వున్నానని ఒక చక్కని, పరిశుభ్రంగా వున్న గదిని చూపించాడు. విశ్రాంతి తీసుకోమని సలహా ఇచ్చాడు. మెహెరాశ్రమంలో నా రెండవ రోజు ఆదివారమయింది. **1927 ఆగస్టు 9వ తారీఖు.**

అప్పటికి నా వయస్సు 17 సంవత్సరాలు. ఆ మర్నాడు క్లాసులు మొదలయ్యాయి. నా తరగతి పిల్లలందరితో కలిసిమెలిసి తిరిగాను. నన్ను హజరత్ బాబాజాన్ హైస్కూల్లో చేర్చుకున్నారు. స్కూలు ప్రారంభమైన తర్వాత కొద్ది రోజులు ఆలస్యంగా నేను స్కూల్లో చేరినట్లు తెలిసింది. కొన్ని పాఠాలు అప్పటికే పూర్తయ్యాయి. స్కూలు సమయం అయిపోయాక సాయంత్రాలు అంతక్రితం పూర్తయిన పాఠాలు నేర్చుకోవాలని ప్రిన్సిపాల్ అన్నారు.

ఇందుకోసం నాకు ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించమని కోరాను.

దానివల్ల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపగల్గుతానని ప్రిన్సిపాల్‌తో అన్నాను.

అక్కడ ఆశ్రమవాసుల ఆనందం మాత్రమే వారు కోరుకుంటారు.

అందువల్ల నేనడిగిన ప్రత్యేక గదిని వెంటనే కేటాయించారు.

## మెహెరాబాద్‌లో నా జీవనం:

ఆ మర్నాడు నేను కోరుకున్న గదికి నా సామాన్లన్నీ తీసుకుని వెళ్ళాను.

అక్కడ గదిలో మరో ఇద్దరు ఇరానీ కుర్రాళ్ళు ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో తెల్లవారుఝామున రెండు మూడు గంటలకే లేచి పరీక్షలకు చదువుకునేందుకు వీలుగావుంది. ఇక్కడి జీవితం సుఖంగా, హాయిగా, ప్రశాంతంగా, కానీ ఖర్చు లేకుండా వుంది. మెహెరాబాద్‌లో వున్న ప్రతి ఒక్కరూ కూడా చాలా మంచివాళ్ళు, అలాగే మంచి నడవడిగలవారు. మెహెరాబాద్‌లో ఉండేవారు, మెహెరాబాద్ పరిసరాలలో ఉండేవారు, అలాగే దూర ప్రాంతాల నుండి వచ్చేవారు అందరూ కూడా ముందుగా బాబా పాదాలకు నమస్కరించేవారు.

ఆయన చేతిని ముద్దాడేవారు. మెహెరాబాద్ వాళ్ళే కాకుండా ఇరాన్ నుంచి వచ్చిన కొంతమంది కూడా బాబా పాదాలు తాకి ప్రణమిల్లేవారు.

నేను ముందుగానే మెహెర్‌బాబాకు చెప్పాను.

ఏమనంటే నాకు గురువులన్నా, బాబాలన్నా నమ్మకం లేదన్నాను.
నేను ఇస్లాం మతస్తుడనని చెప్పాను. ఇస్లాం మతం పైనే నాకు గురి వుందన్నాను.
నా దృష్టిలో మతం అంటే ఇస్లాం మాత్రమే అని చెప్పాను.
ఆధ్యాత్మిక సాధన అంటే నాకు నచ్చదని కుండ బద్ధలు కొట్టినట్లు చాలా నిక్కచ్చిగా బాబాకు చెప్పాను. నా మాటలతో బాబా చిరునవ్వులు చిందించారు.
చదువుకోవాలనుకుంటున్నావు కాబట్టి స్కూల్లో చేర్చుకుంటున్నానని అన్నారు.
మెహెరాబాద్‌లో నేను ఉన్న రెండు మూడు నెలల్లో బాబా మా గదికి తరచు వచ్చారు.
గదిలో మా పరిసరాల పరిశుభ్రతను తనిఖీ చేశారు.
ఏ మాత్రం చిందరవందరగా గది వుంచినా బాబా చికాకు పడేవారు.

## మెహెరాశ్రమానికి బదిలి:

నా భవిష్యత్తు, నా జీవిత గమ్యం బాబాకు బాగా తెలుసు కాబట్టి ఆయన దిగువ మెహెరాబాద్‌లో వుంటున్న గది నుండి ఎగువన గల మెహెరాశ్రమానికి వచ్చి వుండమని రెండు మూడు సార్లు నాకు సలహా ఇచ్చారు. నేను కూడా బాబా సలహాను పాటిస్తూ ఎగువ మెహెరాబాద్‌లోని మెహెరాశ్రమం గదుల్లోకి చేరాను.
క్రమేణా ఆశ్రమవాసులతో, అలాగే ఆశ్రమ నియమ నిబంధనలతో అలవాటుపడ్డాను. అక్కడ ఉండటం నాకు కష్టం అనిపించలేదు. 1927 అక్టోబరు 25న దిగువ మెహెరాబాద్ నుండి ఎగువన గల మెహెరాశ్రమంలో చేరాను.

## మెహెరాశ్రమం గురించి రెండు మాటలు:

ఎగువ మెహెరాబాద్‌లో బాబా సమాధికి సమీపంలో మెహెరాశ్రమం ఉండింది.
వేసవిలో వేడి ఎక్కువ ఉండేదిగాని, ఇతర రోజుల్లో వాతావరణం చాలా బాగుండేది.
అన్నింటికంటే ముఖ్యమైనది 1927 మేలో సాక్షాత్తు అవతారమూర్తి మెహెర్‌బాబా ఈ ఆశ్రమాన్ని నెలకొల్పారు. ఈ స్కూలు అన్ని స్కూళ్ళ వంటిది కాదు.
మనం చూసే స్కూళ్ళు చాలాభాగం ప్రభుత్వం లేదా సేవా సంస్థలు నడుపుతాయి.
మెహెరాశ్రమం అటువంటి స్కూలు కాదు. ఇక్కడ చెప్పే చదువులు మామూలు చదువులు కాదు. ఆధ్యాత్మిక విద్యాబోధన కోసం ఈ ఆశ్రమాన్ని నెలకొల్పారు.
ఇక్కడ పిల్లలకు తిండి, బట్ట చివరకు కాళ్ళకు వేసుకునే చెప్పులు అన్నీ బాబానే ఉచితంగా ఇచ్చేవారు. ప్రతి పిల్లవాడికి ఒక ట్రంకు పెట్టె ఇచ్చారు. నల్ల టోపి, ఖాకి షర్టు, రుమాలు, రగ్గు, దిండు, దుప్పటి, రెండు తలపాగాలు అందరికీ ఇచ్చారు.
అందరికీ శాఖాహారమే వడ్డించేవారు. కులం, మతం, గోత్రం లేకుండా అన్ని మతాలవారికి, కులాలవారికి ప్రవేశం వుండింది. తల్లిదండ్రులు ఆశ్రమ నియమనిబంధనలు తెలుసుకుని అంగీకరించిన పిదపనే ఆశ్రమంలో

అనుమతించేవారు. ఆశ్రమంలో మొత్తం ఐదు సంవత్సరాలు తప్పనిసరిగా ఉండాలి. హాకీ, క్రికెట్, పింగ్‌పాంగ్ ఇంకా ఇతర ఆటలు ఆడుకునేందుకు వీలుండేది. ఆశ్రమంలో మొత్తం 120 మంది విద్యార్థులున్నారు. నా తోటి విద్యార్థులందరితో అలాగే అన్నింటికంటే మిన్నగా భగవంతుని సాన్నిధ్యంలో నేను గడిపాను.

## ఆధ్యాత్మిక ప్రసంగాలు:

గవర్నమెంట్ సిలబస్ ప్రకారం స్కూల్లో పాఠాలు చెప్పేవారు. ఇంగ్లీషు, చరిత్ర, భూగోళం, గణితంతో పాటు పురాణాలు, ఇతిహాసాల నుంచి ఆధ్యాత్మిక విషయాలు బోధించేవారు. ఆశ్రమంలో గుజరాతీ, మరాఠీ, పర్షియన్ భాషల పిల్లలున్నారు. అందుకని ఆ మూడు భాషల్లో క్లాసులు జరిగేవి. ప్రతి సోమవారం అందరి చేత బాబా ప్రవచనాలు చదివించేవారు. అవి కొత్తవికావు, అప్పటికే పుస్తక రూపంలో వచ్చినవి.
మిగిలిన రోజుల్లో ఏ భాష వారికి తగ్గట్టు ఆ ప్రాంత ఋషులు, సద్గురువుల సూక్తులు చదివించేవారు. ప్రతిరోజు రాత్రి ఏడు నుండి ఒక గంట సేపు బాబావారి ఆధ్యాత్మిక ప్రవచనం ఉండేది. ఎనిమిదింటికి అందరూ నిద్రపోయేవారు.
నీళ్ళ ఎద్దడి వుంది కాబట్టి రోజు విడిచి రోజు స్నానం చేసేవాళ్ళం.
బాబా తన ప్రవచనాలను అక్షరఫలకంపై చెపుతుంటే,
రావ్‌సాహెబ్ ఆ పాఠాన్ని పైకి చదివి వినిపించేవారు.
పిల్లలు శ్రద్ధగా వినేవారు.
బాబావారు ఆధ్యాత్మిక విషయాలు చెప్పేవారు.
బాబా సమాధి దగ్గర వున్న కిటికీ వద్ద కూర్చునేవారు.
కిటికీకి ఎదురుగా అరుగు మీద మండలివారు, ప్రేమాశ్రమం పిల్లలు కూర్చునేవాళ్ళం.
నాకు అర్హులు అనిపించినవారికి ప్రేమామృతం పంచుతాను.
వారి జీవితం సార్థకం చేసే మందుని ఇస్తాను.
పిల్లలందరూ గుర్తుంచుకోవాలి.
భగవంతుడు ఒకటే సత్యం. నిత్యం.
భగవంతుడు తప్ప మిగిలిన వేటికీ విలువ లేదు.
కాబట్టి నేను చెప్పిన ప్రకారం నడుచుకోండి.
బాబా పాఠాలు చెప్తుంటే నాకు ఆయన కళ్ళల్లో చూసే శక్తి వుండేది కాదు.
ఆయన కళ్ళు అంత ప్రకాశవంతంగా వుండేవి.
నేను తల దించుకొని పాఠాలు వినేవాణ్ని.
నా కళ్ళలోకి చూసే ప్రయత్నం చేయమన్నారు!
శ్రద్ధగా ఆలకించమని నన్ను హెచ్చరించారు.

**అంతేకాదు అనేక ఖనిజాల మిశ్రమంలో నుండి,**
**నిన్ను మేలిమి బంగారం చేస్తానన్నారు.**
**ఈ మాటలు నాపై గాఢంగా పడ్డాయి.**
ఆ రాత్రంతా బాబావారి మాటలు గుర్తుకొస్తూనే వున్నాయి.
ఆ మర్నాడు సెలవు దినమయింది.
హాకీ ఆట ఆడుతున్నాం.
ఆ రోజు ఆదివారం.
నేను వేగంగా పరుగెత్తుతున్నాను.
నా మొహంలో రంగులు మారుతున్నావ్.
నాలో వస్తున్న మార్పుల్ని నా తోటి స్నేహితులు గమనించారు.
ఇంతలో మధ్యాహ్నం భోజనం గంట మ్రోగింది.
రెండు ముద్దలు నోట్లోకి వెళ్ళాయో లేదో నాలో ఏదో పెద్ద మార్పు వచ్చింది.
నా అన్నం కంచాన్ని ప్రక్కన పెట్టాను.
నాకు స్పృహ తప్పినట్లయింది.
మరో లోకంలోకి వెళ్ళిపోయాను.
గట్టిగా ఏడవడం ప్రారంభించాను.
కళ్ళు తిరిగి క్రిందపడిపోయాను.
నా చుట్టుప్రక్కల ఉన్నవారిని గమనించే స్థితిలో లేను.
నాకు ఒక బ్రహ్మాండమైన వెలుగు కనబడింది.
వింత కాంతుల మెరుపు అది. ఆ వెలుతురు చూసి తట్టుకోలేకపోయాను.
బాబా పేరు గట్టిగా అరుస్తూ చైతన్యం కోల్పోయాను.
అలా సుమారు ఐదు గంటలు వున్నాను. ఆ తర్వాత నేను సాధారణ స్థితికి వచ్చాక నన్ను బాబా దగ్గరకి తీసుకెళ్ళారు. బాబా నన్ను ఓదార్చి వెళ్ళి నిద్రపొమ్మనమని చెప్పారు. ఆ మర్నాడు ఉదయం తిరిగి బాబా పాదాల వద్ద కూర్చున్నాను.
గత రాత్రి కంటే నా పరిస్థితి భిన్నంగా వుంది.
అంతక్రితం రోజుల్లో బాబా ఎదుట కూర్చోగానే నన్ను నేను మర్చిపోయి అనంతమైన దైవీ ప్రేమ మత్తులో మునిగిపోయేవాడిని. కాని ఈరోజు నాకలా జరగలేదు.
నా హృదయం తేలికైనట్లుంది. బాబావారినే చూస్తూ కూర్చున్నాను.
బాహ్యంగా నా కళ్ళు మూసుకున్నాయి. కానీ నా అంత:నేత్రం తెరుచుకునే వుంది.
నాలోని అణువణువు భగవంతుణ్ణి దర్శిస్తున్నట్లు కనిపించింది.
నా చుట్టుప్రక్కల ప్రపంచాన్ని మర్చిపోయి వున్నాను.
ఇలా నేను ఐదు రోజులు వున్నాను.

ఎక్కడ చూసినా బాబానే కన్పించారు.
ఐదు రోజుల తర్వాత క్రమేణా నా పరిసరాల చైతన్యం లభించింది.
యావత్ ప్రపంచం నేను చూస్తున్నదంతా పెద్ద మాయ అని, ఒక కల అని తెలిసింది.
ఈ సమయంలోనే బాబా నా గురించి ప్రస్తావిస్తూ మండలివారితో నేను ఆరవ భూమికలో చేరానని కనులారా భగవంతుడిని చూస్తున్నానని ప్రకటించారు.
నాపేరు మార్పు చేశారు. ఇకపై చోటా బాబా అని పిలవమన్నారు.
కానీ నా ఏడుపు మరింత పెద్దగా ఎక్కువయ్యింది.
ఒళ్ళంతా ఒణుకుతోంది. శ్వాస తీసుకోవడం కష్టమయ్యింది.
నేను భగంతునిపై ప్రమాణం చేసి చెప్తున్నాను. **(నేను ఈ మాటలు చెప్తున్నప్పుడు నా హృదయం రాయిలాగా మారి, కళ్ళంబడి నీళ్ళు వచ్చేలాగా వుంది.)**
బాబాకేసి చూస్తూ ఆయనే నా ప్రాణం, నా జీవితం, నా సర్వస్వం అని అనుకున్నాను.
నీవు లేకుండా నాకు జీవితం లేదనుకున్నాను.
ఆ తర్వాత నడుస్తున్నా, మాట్లాడుతున్నా, తింటున్నా, చదువుకుంటున్నా అన్నింటా అవతారుడే దర్శనమిచ్చాడు. అన్నివేళలా ఆయన ఆలోచనలతో నిండిపోయాను.
ఇలా రోజులు, వారాలు గడిచిపోయాయి.
నేను అవతారుడి మత్తులో మునిగిపోయాను. ఆకలి దప్పికలు మర్చిపోయాను.
నా చుట్టుప్రక్కల ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలో వున్నాను.
కళ్ళెదుట అందమైన అవతారుని చిత్రం దర్శనమౌతుంది.
ఆనాటి నా పరిస్థితి నేను మాటల్లో వర్ణించలేను.

## చదువు మధ్యలో మానేశాను:

క్లాస్ రూంలో చదువుపై ధ్యాస నిలవడం లేదు.
పుస్తకం తెరిస్తే నా ప్రియతమునికేసి మనస్సు పోతోంది.
భగవంతుని నామ స్మరణతో ధ్యానంలోకి వెళ్ళిపోతున్నాను.
మనస్సు పుస్తకాలపై నిలకడ లేకపోవడంతో నా క్లాసు పుస్తకాలన్నింటికీ ఒకరోజున నిప్పు అంటించాను. రాసుకునే పెన్నుని విరిచేశాను.
రోజుకి సుమారు 14 గంటలు నా ప్రియతముని స్మరణలోనే గడిపాను.
ప్రేమాశ్రమం మూసివేసిన తర్వాత నేను బాబావారు, ఆయన మండలివారితో మెహెరాబాద్‌లో వున్నాను. బాబా కాశ్మీర్ పర్యటనకు వెళ్ళేటప్పుడు నేను కూడా ఆయనతో వెళ్ళాను. ఆ తర్వాత బాబా రెండవసారి ఇరాన్ వెళ్ళినప్పుడు నేను ఆయనతో వున్నాను. బాబాతో నేను ఇరాన్‌లోని ఇసస్ఫహాన్‌లో రెండు నెలలు వున్నాను.
ఆ తర్వాత బాబా అనుమతితో నేను కోరుకున్నట్లుగా నేను ఇరాన్‌లోనే వుండిపోయాను.

చాలా సంవత్సరాల తర్వాత **బాబా ప్రేమికులు మెహెర్‌జీ కర్కారియా** అబ్దుల్లాను ఇరాన్‌లో కలిశాడు. ఆయన అబ్దుల్లాతో ముచ్చటించాడు. ఆ సంభాషణ ఇకపై మెహెర్‌జీ కర్కారియా మాటల్లోనే పరిశీలించండి!!

## మెహెర్‌జీ కర్కారియా ఇలా చెప్పారు:

1943లో నేను నా వ్యాపార నిమిత్తం పర్షియా వెళ్ళాను.
ఈ చోటా బాబా అబ్దుల్లా దగ్గర్లోని ఓడరేవులో పనిచేస్తున్నాడని తెలిసింది.
అబ్దుల్లాను నా వ్యాపారంలో అకౌంట్స్ చూసేందుకు నియమించుకుందామనుకున్నాను.
నాకు ఒక నిజాయితీ గల అకౌంటెంట్ అవసరముంది. అందుకు అబ్దుల్లా సరైనవాడననుకున్నాను. అబ్దుల్లాకు నా దగ్గర ఉద్యోగం ఇచ్చేందుకు బాబా అనుమతి కోరుతూ లేఖ రాశాను. బాబా సంతోషంగా అంగీకరించారు.
వీలైతే అతగాడిని నాతో ఒకమారు మెహెరాబాద్‌కి తీసుకురమ్మన్నారు.
ఆ దరిమిలా నేను అబ్దుల్లాకు లేఖ రాశాను. ఉద్యోగంలో చేరమని చెప్పాను.
దేనికీ జవాబు రాలేదు. చాలా రోజుల తర్వాత ఒకరోజు నన్ను కలిశాడు.
**నాకు చిక్కావు కదా ఇక నిన్ను వదిలిపెట్టనన్నాను.**
దాంతో నవ్వుతూ అబ్దుల్లా తన గురించి ఇలా చెప్పుకొచ్చాడు.
**"బాబాతో నేను పర్షియాకు 1930-31 ప్రాంతంలో వచ్చాను.**
ఆ తర్వాత ఒకసారి మెహెరాబాద్‌కు రమ్మనమని బాబా కేబుల్ పంపారు.
ఆ రోజుల్లో నేను పనిచేసే కంపెనీలో సెలవు దొరకక వెళ్ళలేదు.
బాబాతో నేను ఉండే రోజుల్లోనే ఇరాన్ వెళ్ళిపోవాలనుందని, సెలవు ఇప్పించమని బాబాని వేడుకున్నాను. బాబా కొద్దిరోజులు ఆగమన్నారు.
ఐనా నేను గట్టిగా వెళ్లిపోవాలని ఒత్తిడి చేయడంతో
బాబా నాకు ఆలింగనమిచ్చి క్షేమంగా వెళ్ళమని అనుమతించారు.
బాబా నాకు ఆలింగనమిచ్చినప్పుడు బాబావారి కళ్ళల్లో నీళ్ళు చూశాను.
బాబాతో నా 43 సంవత్సరాల సాంగత్యంలో నేనింతవరకు రెండే రెండుసార్లు బాబా కళ్ళలో నీళ్ళు చూశాను. అది ఎవరో తనను వదిలి వెళ్తున్నందుకో లేదా మరెవరో మరణించినందుకో కాదని నాకు తెలుసు.
బహుశా, ఆయన పనికి అడ్డు వచ్చినందుకు అయుంటుందని నా భావన.
**మెహెర్‌జీ -అలాంటి సమయంలో బాబాని వదిలి వెళ్ళినప్పుడు ఏదైనా తీవ్ర పరిణామాలు ఎదురైవుండవచ్చును కదా?**
బాబాను వదిలిపెట్టిన తర్వాత నేను ఒక ఆంగ్లో పర్షియన్ ఆయిల్ కంపెనీలో చేరాను. చాలాకాలం ఆనందంగా వుంది.

ఆ సమయంలో పర్షియాలో వున్న దినపత్రికను కరాచీలో వున్న నా స్నేహితుడికి పోస్టులో పంపుతుండేవాడిని. అలాగే, నా కరాచీ స్నేహితుడు భారతీయ దినపత్రికని నాకు పోస్టు చేశేవాడు. నేను పర్షియన్ పత్రికల్లో ప్రచురించిన హాఫీజ్ పద్యాలు, సూక్తుల్ని కరాచీ స్నేహితునికి పంపేవాడిని. అలాగే అతను భారతీయ పత్రికలలో ప్రచురించిన సాహిత్యాన్ని నాకు పంపేవాడు. నేను పనిచేస్తున్న ఆయిల్ కంపెనీ బ్రిటీషువారి ఆధీనంలో వుండింది. పర్షియన్ పోస్టాఫీసువారు భారతీయ దినపత్రికల బట్వాడాలో పత్రికలలోని కథనాలను అనుమానించారు. అదేదో మా ఇరువురి మధ్య నడుస్తున్న కోడ్ భాషగా వారు భావించారు. నేను పనిచేస్తున్న బ్రిటీషు కంపెనీవారు పర్షియన్‌లను నమ్మేవారు కాదు. ఈ నేపథ్యంలోనే నేను పర్షియన్ సమాచారాన్ని కరాచీ పంపుతున్నాననే అనుమానంతో ఎలాంటి విచారణ లేకుండా తీసుకెళ్ళి ఖైదీగా జైల్లో వుంచారు. ఆ చీకటి గదులలో సుమారు మూడు నెలలు వున్నాను. ఆ దరిమిలా విచారణలో వారి అనుమానాలు రుజువు కాకపోవడంతో, పట్టణ పొలిమేరలు దాటి పోరాదని షరతులతో కూడిన నిషేదాజ్ఞలతో జైలు నుండి విడుదల చేశారు. ఇది బాబా ఇచ్ఛకు వ్యతిరేకంగా నేనిక్కడకు వచ్చినందుకు జరిగిన పరిణామమేనని నా నమ్మకం. ఆ కారణంగానే మీరు (మెహెర్‌జీ కర్కారియా) ఉద్యోగమిస్తామన్నా వచ్చి చేరలేకపోయాను.

**మెహెర్‌జీ -అయితే ఇప్పుడు పరిస్థితిలో మార్పు వచ్చింది.**

**పర్షియాలో ప్రభుత్వాలు మారాయి. నేను స్థానిక అధికారులతో మాట్లాడతానని భరోసా ఇచ్చాను. దాంతో అబ్దుల్లా నా దగ్గర కొంతకాలం పనిచేశాడు.** నేను పర్షియా వదిలే వరకు నాకు తోడుగా వున్నాడు.

1975లో బాబా ప్రేమికురాలు **ఇరివిన్ లక్**తో అబ్దుల్లా మాట్లాడుతూ ప్రస్తుతానికి తనకు ఆనాడు మెహెరాబాద్‌లో అనుభవించిన అనుభూతులు ఏమీ లేవని చెప్పాడు. రాబోయే జన్మలో నాకు భగవంతుడు తన లక్ష్యాన్ని చేరుకునేలా చేస్తాడేమోనని అన్నాడు. ఆనాడు అనుభవించిన ఆరవ భూమిక అనుభూతి అంతా అదృశ్యమయిందన్నాడు. అవతారుని ఆశ్రమంలో ఒక అద్భుత జీవనాన్ని తాను గడిపానన్నాడు. ప్రాపంచిక జీవితంలో నేను గడుపుతున్న తన వ్యాపార లావాదేవీలలో, సమాజంలో అవతారుడు సూచించిన సత్యమార్గాన్నే నిజాయితీతో సత్యం, ధర్మంగా నియమబద్ధ జీవితాన్ని గడుపుతున్నానని అబ్దుల్లా వివరించాడు.

❊ ❊ ❊

**అబ్దుల్లా ఆరవ భూమికలో వున్న సమయంలో, ఆతని పరిస్థితిపై లార్డ్‌మెహెర్‌లో వివరణ ఇలా వుంది. పరిశీలించండి.**

## లార్డ్ మెహెర్ ఆధారంగా..,

లోహాల మిశ్రమంతో వున్న మిమల్ని మేలిమి బంగారంగా మారుస్తాను, అని బాబావారు చెప్తుంటే, అబ్దుల్లా మరో లోకం లోకి వెళ్లిపోయాడు. బాబావారి కిటికీలో వెలుతురు కనిపించింది. ఆషామాషీ వెలుతురు కాదు. ఆ వెలుతురును చూసి తట్టుకోలేక పోయాడు. కళ్ళు తిరిగి పడ్డాడు. వీడిని వెంటనే ఆస్పత్రికి తీసుకు వెళ్ళండన్నారు బాబా. కుర్రాడిని ఎత్తుకొని ఆస్పత్రికి తీసుకువెళ్ళండన్నారు బాబా. కుర్రాడిని ఎత్తుకొని ఆస్పత్రికి, బయలుదేరారు మండలి వారొకరు. ఇంకొక ఇద్దరు వెంట కదిలారు.కొండ దిగువకి వెడుతున్న అబ్దుల్లావంక బాబా ప్రేమగా, లాలనగా చూశారు. అక్కడ ఆస్పత్రిలో అబ్దుల్లో నిస్త్రాణగా పడుకొన్నాడు. భౌతిక చైతన్యం పోయింది. కళ్ళు తెరిచే వున్నాయి. కానీ ఏమి చూస్తున్నాడు,ఎటు చూస్తున్నాడో అంతు చిక్కటం లేదు. అలా నాలుగు రోజులు వున్నాడు.అబ్దుల్లాని చూడ్డానికి ఎస్పన్దియర్ వేసాలి వచ్చాడు. పరిష్యా నుంచి వచ్చిన మెహెరాశ్రమ పిల్లలో ఒకడు ఇతగాడు.

**వేసాలి–** "ఏరా! అబ్దుల్లా! నేనెవరో తెలుసా!" అబ్దుల్లా కళ్ళు తెరిచాడు. మిత్రుడి కేసి చూశాడు. నెమ్మదిగా అన్నాడు. "ఆ! తెలుసు! నువ్వు ఎవరో.

**వేసాలి–** "అయితే చెప్పు! నేనవరో!" **అబ్దుల్లా–** నువ్వా! నువ్వు బాబావి!

**వేసాలి–** (మంచం ప్రక్కన పడి వున్న అగ్గి పెట్టె తీసుకొని) ఇది చూస్తున్నావా! ఇది ఏమిటో చెప్పు! **అబ్దుల్లా–** అదా! అది బాబా.

ఇలా వేసాలి ఎన్ని ప్రశ్నలు వేసినా, అన్నింటికీ అబ్దుల్లా జవాబు వొక్కటే. అతని నోట పలికే మాట వొకటే. **'బాబా'** అన్నమాట తప్ప మరోమాట రాలేదు. అతని ఎక్కడ చూసినా బాబానే కన్పిస్తున్నారు. అన్ని వస్తువులూ బాబాగా దర్శనమిస్తున్నాయి. బాబా కృపవల్ల ఆరవ భూమిక చేరిన అబ్దుల్లా భగవంతుడిని కనులారా చూస్తున్నాడు. ఈ స్థితిలోనే వుండిపోయేవాడేమో మరి. కానీ బాబా ఐదవ రోజు నుంచి అతనికి కొంచెం కొంచెంగా పరిసరాల చైతన్యాన్ని ప్రసాదించారు. అబ్దుల్లాకి ఎనీమా చేయండి అన్నారు. ఎనీమా చేశాక కొంచెం కొంచెంగా పరిసరాలు తెలిసి రాసాగాయి.బహుశా నాల్గో రోజునో, అయిదో రోజునో, అబ్దుల్లా గట్టిగా ఏడవ సాగాడు. హృదయ విదారకంగా వుందాతని ఏడుపు. అతని వ్యధ కళ్లలో కనిపించింది. పరాత్పరుని దర్శనం పూర్తి చేసుకొని స్థూల భౌతిక ప్రపంచంలో అడుగుపెడుతున్నాడు. ఆరవ భూమిక నుంచి దిగి వస్తుంటే, మనస్సు భరించ లేకపోతోంది. అబ్దుల్లాని క్రిందికి దిగి రావాలన్నది బాబా వారే నిర్ణయించారట. ఈ సంగతి దరిమిలా తెలిసింది. ఆరవ భూమిక నుంచి మామూలు చైతన్య స్థితికి అతడిని తీసుకు వచ్చింది బాబావారే. ఈవాళ్టి నుంచి నీ పేరు మార్చేస్తున్నా. నువ్వు ఇహ ఛోటా బాబావి అన్నారు.

***



# కరీం బాబా

కరీం బాబా ఆరవ భూమికలోని మజ్జూబ్‌లాంటి మస్తు. తేజోవంతమైన అతని ముఖవర్చస్సు, శోభాయమానమైన కన్నులు ఎటువంటి వారినైనా ఇట్టే కట్టిపడేస్తాయి. పండితులైనా పామరులైనా ఒకసారి వానినిచూస్తే ఇక మరువలేరు. అలాగే, పెద్ద పులిని అకస్మాత్తుగా చూస్తే కలిగే భయంలాగా, కరీం బాబా ఒక్కొసారి భయపెట్టేలాగా వుంటాడు. అందుకనే ఇతనిని **"ది టైగర్ మ్యాన్"** వ్యాఘ్ర-మానవుడు అని పిలిచేవారు. కరీంబాబా 1940వ సంవత్సరంలో మొదటిసారి కలకత్తాలో పేవ్‌మెంటు మీద వుండగా బాబా కలిసారు. మురికి గుడ్డలతో ఇనుపతీగలు మెడకు చుట్టుకొని ఉన్నాడు. పాతడబ్బాలు, చెత్తాచెదారం అతని చుట్టూ వుంది. కాళ్ళకు, చేతులకు గుడ్డ పీలికలు చుట్టుకున్నాడు. తల వెంట్రుకలు, గెడ్డం ఒత్తుగా నల్లగా మురికితో జడలు కట్టివుంది. చేతివ్రేళ్ళ గోళ్ళు పొడవుగా ఉన్నాయి. ఇటువంటి మురికి పరిసరాల్లో వున్నా అతని కళ్ళు సానపట్టిన కత్తిలా మెరుస్తున్నాయి. గత ఆరు సంవత్సరాలుగా అతను అక్కడే ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉన్నాడని అక్కడివాళ్ళు చెప్పారు. కరీం బాబా కలకత్తా నగరానికి ఆధ్యాత్మిక సంరక్షకుడు (స్పిరిట్యువల్ చార్జ్‌మన్) అని బాబా అన్నారు.

1940 జూలైలో మెహెర్‌బాబా రాంచీలో ఒక చిన్న ఆశ్రమం నిర్వహించారు. కలకత్తాకు నైరుతిలో రెండు వందల మైళ్ళ దూరంలో రాంచీ పట్టణం వుంది. కరీం బాబాను రాంచి ఆశ్రమానికి తీసుకురమ్మనమన్నారు. ఈ పనిని కాకాబారియాకు అప్పగించారు. గత ఆరు సంవత్సరాలుగా కరీంబాబా కలకత్తాలో వుంటున్నాడు. ఆతడిని ఒప్పించి, బుజ్జగించి రాంచీ తీసుకురావడం అంతసులభమైన విషయం కాదు. ఐతే, మస్తుల అన్వేషణలో కాకాబారియా, బైదులు బాగా ఆరితేరారు. ఇలాంటి విషయాల్లో బాబా సహాయం చేస్తారనేది వారి అనుభవం. కాకాబారియా కరీం బాబాను తనతో రావలసిందిగా కోరినప్పుడు, ముందుగా చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు. ఆ తర్వాత కాకా బజారుకెళ్ళి ఒక కొత్త అంగీ (కఫ్నీ), లుంగీ తీసుకొచ్చాడు. స్థానికంగా టీ అంగడిలో వున్న ఇద్దరు మహ్మదీయుల సహాయం తీసుకున్నాడు. అలాగే ఒక గుర్రబ్బండి సిద్ధం చేసుకున్నాడు. ఆ రోజుల్లో గుర్రబ్బళ్ళు, జట్కాలు, ఎక్కువగా ఉండేవి. మొదట కరీం బాబాచే క్రొత్త బట్టలు కట్టించాడు. కరీం బాబా కలకత్తాలో బాగా ప్రసిద్ధి. అక్కడుండే ధనికులు ఇతడిని

పట్టించుకోకపోయినా, బీదవారికి అతనంటే అమితమైన గౌరవం. ఆ చుట్టుప్రక్కలవారు చాలామంది గుమ్మిగూడారు. క్రొత్తబట్టలతో కరీం బాబా ఠీవిగా నిలబడ్డాడు. ఏ నిముషానికి ఏం జరుగుతుందోనని కాకా భయపడ్డాడు. అయితే, ఏమీ జరుగలేదు. స్థానికులు వింతగా, ఆశ్చర్యంగా జరుగుతున్నది చూస్తూ నిలుచున్నారు. ఆ తర్వాత కరీం బాబా గుర్రబ్బండిలో కూర్చున్నాడు. అతడు కూర్చోడానికి మెత్తని పరుపు వేసారు. కరీం బాబా ఆ మెత్తపై కూర్చోడానికి ఒప్పు కోలేదు. ఎలాగైతేనేమి, రాంచీ వెళ్ళడానికై కలకత్తా రైల్వే స్టేషనుకు బయల్దేరారు. రైలులో మూడవ తరగతి పెట్టెలో కూర్చున్నారు. ఇంతవరకు కరీం బాబా చెప్పినట్లే చేశాడు. బండి బయలుదేరగానే ' 'టిక్కెట్టు దొరికింది, బండి బయలు దేరింది" అన్నాడు కరీం బాబా. ఈ మాటల్లో కాకాకు రెండు అర్ధాలున్నాయనిపించింది.

1. మామూలు అర్ధంలో ప్రయాణం ప్రారంభమైందని.

2) తానిప్పుడు బాబా దగ్గరకు వెడుతున్నాడని, ఇక తన ఆధ్యాత్మిక ప్రగతి మొదలవుతుందని, కాకా అనుకొన్నాడు. రైలు బయలుదేరిన కొద్దిసేపటికే కరీం బాబాలో అలజడి మొదలైంది. ఒకటి రెండుసార్లు కిటికీలోంచి కాళ్ళు బయటకు పెట్టి దిగిపోవడానికి ప్రయత్నించాడు. కాకాకు ఏమీ పాలుపోలేదు. ఆ తర్వాత జరిగిన వింత సంఘటన వ్రాసినట్లైతే పాఠకులు కలవరపడవచ్చు. అయితే ఈ సంఘటన వ్రాయకపోయినట్లైతే కరీం బాబా చరిత్ర సరిగా అర్ధం కాదు. కరీం బాబా బాధ ఏమిటో తెలియక టాయ్‌లెట్‌కి తీసుకువెళ్ళాడు. మలవిసర్జన చేసాడు. ఆ తర్వాత మలంలోంచి మూడు నాలుగు రెండణా నాణెములు, ఒక రాగి తీగముక్క తీసి, కుళాయి క్రింద కడిగి, మరల నోటిలో వేసుకుని మ్రింగేశాడు. ఆ తర్వాత రోజుల్లోనూ కరీం బాబా ఇలానే చేసేవాడు. సాధారణ ఆరోగ్య సూత్రాలు మస్తులకు వర్తించవు. ప్రాపంచిక విషయాల పట్ల వారు ఉదాశీనంగా ఉంటారు. మస్తులు ప్రపంచాన్ని ఒక కలలా భావిస్తారు. ఆ పిదప ఏమాత్రం కష్టం లేకుండా వారు రాంచీ చేరుకున్నారు.

రాంచీలో బాబా దగ్గర ఆరవ భూమికలో వున్న మస్తులు వున్నారు.
అందులో చట్టి బాబా కూడా వున్నాడు.
రాంచీ ఆశ్రమంలో కరీం బాబాకు ఒక చిన్న గదిని కేటాయించారు.
బాబా అతనికి అన్నం తినిపించి ఏకాంతంగా చాలాసేపు గడిపేవారు.
సాధారణంగా కరీం బాబా మౌనంగా ఉండేవాడు.
అయితే అప్పుడప్పుడు హఠాత్తుగా రపీమని ఒక్కమాట వదిలేవాడు.
అతి తక్కువగా మాట్లాడినప్పటికీ నవ్వుతూ ఉండేవాడు.
అర్ధరాత్రి వేళ శ్రావ్యంగా పాటలు పాడేవాడు. బాబా తన దగ్గర వున్న మస్తులకు స్నానం చేయించేవారు. కానీ కరీం బాబాకు ఎప్పుడూ స్నానం చేయించ

లేదు. ప్రతిరోజూ బాబా అతనికి అన్నం తినిపించి, చాలాసేపు అతని దగ్గర కూర్చునేవారు. ఇలా రాంచీలో ఉన్నప్పుడే మెహెరాబాదులో ఉన్న పెండూకి ఒక టెలిగ్రాం ఇచ్చి కరీం బాబా కోసం పాత ఆసుపత్రి బిల్డింగులో ఒక గది కట్టించమని చెప్పారు. జూలై నెలాఖరికి బాబా తన మండలితో కలకత్తా మీదుగా మెహెరాబాద్‌కి తిరిగి వచ్చారు. వీరు వచ్చేటప్పటికి గట్టి వెదురు తడకలతో పెండూ కట్టించిన గది సిద్ధంగా ఉంది. కరీం బాబాకు ఆహారం, నీరు, ఇతర వస్తువులు వెదురు తడక తలుపులోంచి ఇచ్చేవారు. ఆ ప్రక్క గదిలోనే బాబా ఉండేవారు.
ప్రతిరోజు బాబా స్వయంగా కరీం బాబాకు కావలసినవన్నీ సమకూర్చేవారు. రెండు వారాల తర్వాత కరీం బాబాతో తనపని అయిపోయిందని చెప్పి కాకాతో కలకత్తా పంపించారు. రైలు కలకత్తా సమీపిస్తుంటే కరీం బాబా రెండుసార్లు గట్టిగా కాకాను లెంపకాయకొట్టాడు.
కలకత్తాలో మునిపటి ప్రదేశంలోనే కరీంబాబాను కూర్చోబెట్టి, ఆతని బాగోగులు చూడ్డానికి తగిన ఏర్పాటు చేసాడు.
అందుకు అవసరమైన డబ్బు వారికి ఇచ్చాడు.
1940 తరువాత బాబా రెండుసార్లు కలకత్తా వెళ్ళారు.
బీదలకు అన్న దానం చేసి, మస్తులను కలుసుకున్నప్పటికీ,
కరీం బాబాను ఆయన మళ్ళీ కలుసుకోలేదు.

***

# విశాఖపట్నం

07.06.2015 ఆదివారం ఉ. 5 గంటల నుండి సా. 6 గంటల వరకు శ్రీ రత్నం గారి ఆధ్వర్యంలో బాబా నామంతో నగర సంకీర్తన, 21.06.2015న మెహెర్ నామ విశిష్ఠతపై గోష్ఠి నిర్వహించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

# పార్వతీపురం సెంటర్ నూతన కార్యవర్గం

విజయనగరం జిల్లా పార్వతీపురం సెంటర్ నూతన కార్యవర్గం: సర్వశ్రీ –అధ్యక్షులు: డా॥ మంచిపల్లి శ్రీరాములు, ఉపాధ్యక్షులు: సో॥ బెహరా వెంకటరావు, లచ్చిరెడ్డి ఉదయ మెహెర్, **కార్యదర్శి**: లాడె బాలకృష్ణారావు, ఉప కార్యదర్శి: లచ్చిరెడ్డి రామకృష్ణ, దొగ్గరాధ, కోశాధికారి: సాధనాల సూర్యనారాయణ, సహాయ కోశాధికారి: లచ్చిరెడ్డి బాలాజీ రావు మరియు గౌరవ అధ్యక్షులు: పసుమర్తి గురునాధరావు, గౌరవ సలహాదారులుగా గొర్లి అప్పలరాజు, కొత్తకోట శ్రీనివాసరావులు ఎన్నికయ్యారు.



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్,
వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్,
న్యూఢిల్లీ

*(గత సంచిక తరువాయి)*

కలరా రాకుండా టీకా వేయించుకోవాలి అక్కడ.
బాబావారు బొంబాయిలోనే కలరా టీకా వేయించుకొన్నారు.
మళ్ళా ఇక్కడ అనవసరం కదా. ఆ మాటే చెప్పాడు చాన్జీ గారు.
ఆయన మాట పట్టించుకోలేదు అక్కడి అధికార్లు.
మీ పెద్దాయన కూడా టీకా వేయించుకు తీరాల్సిందే అని స్పష్టం చేశారు.
ఏం చేస్తాం! కానీయండి అంటూ బాబావారు కలరా టీకా వేయించుకొన్నారు.
అధికార్లు తమ మాట నెగ్గినందుకు సంతోషించారు.
ఇహ మీరు ఓడ దిగి కష్టమ్స్‌వారి తనిఖీకి వెళ్ళవచ్చున్నారు.
అక్కడ ఇంకో ఇబ్బంది ఎదురయింది.
బాబావారి గురించిన పుస్తకాలు, బాబా లాకెట్లు, బాబా ఫోటోలు,
బాబావారికి ఇష్టమైన గ్రామఫోను రికార్డులు చూసిన కస్టమ్స్ ఆఫీసరు గారు
అగ్గి గుగ్గిలమయ్యాడు. ఇస్లామ్ వ్యతిరేక సాహిత్యాన్ని మా దేశానికి తీసుకురాకూడదు.
మీరు తెచ్చినదంతా ఇస్లామ్ వ్యతిరేక సాహిత్యమే.
ఇక్కడే వదిలేయండి. మీ దేశం తిరిగి వెళ్ళేటప్పుడు తీసుకోండి అంటూ వాటిని స్వాధీనం చేసుకొన్నాడు. అప్పుడు బాబావారేమన్నారో తెలుసా?
ఇహ వీటి గురించి మరచిపోండి అన్నారు.
వాళ్ళు తిరిగి ఇవ్వరు ఒకసారి స్వాధీనం చేసుకొన్నాక.
మనల్ని ఇబ్బందులు పెడతారు సరికదా నా పనికి అడ్డాలు సృష్టిస్తారు అన్నారు.
అంటే బాబావారి ఏకాంతవాసానికి అడ్డాలు వస్తాయన్న మాట.
ఈ అనర్థం నీవల్లనే అంటూ బువా సాహెబ్‌కి అక్షింతలు వేశారు.
కొంచెం అవిధేయత చూపించావు.
చూసావా ఎంత కష్టం వచ్చిందో అన్నారు.
ఏదో అంతా బాగా జరిగిపోతోంది అనుకొన్నాను.
కానీ బండి గాడి తప్పిందని పేర్కొన్నారు.

తమ ప్లాను తారుమారయిందని వ్యాఖ్యానించారు.
ఎంత ఉపద్రవం వచ్చిపడింది అంతా ఒక్క మనిషి నిర్లక్ష్యం వల్లనే అని బువా సాహెబ్‌ని దులిపేశారు. పుస్తకాలు ఎందుకు తెచ్చావని నిలదీశారు.
నువ్వెంత కష్టం తెచ్చావో తెలుసా? అని సూటిగా ప్రశ్నించారు.
ఈ తలపోటుకి కారకుడివి నువ్వేనన్నారు.
ఇప్పటికైనా తెలిసిందా నీకు
మంచి ఉద్దేశ్యంతో నా గురించి ఎవరితో మాట్లాడినా
ఒక్కోసారి పరిస్థితులు అస్తవ్యస్తమవుతాయి అని చురక వేశారు.
పాపం బువా సాహెబ్ గారికి నోట మాట రాలేదు.
నా మూర్ఖత్వం ఎంత ఉపద్రవం తెచ్చింది అని కుమిలి పోయాడు.
"ప్రభు ఏదో దారి నువ్వే చూపించు, గట్టెక్కించు" అని మనస్సులోనే ప్రార్థించాడు.
ఈ ప్రార్ధన ప్రభు చెవిన పడింది. అందుకనే ఏమన్నారో తెలుసా?
మీరు ఊహించగలరా పాఠకమహాశయా!
మీరే కాదు ఎవరూ ఊహించలేరు అవతారుని మనోగతం.
అందుకనే ప్రభువు ఏమన్నారో ఆయన మాటల్లోనే విందాం.
పుస్తకాల పేరు చెప్పి ఇంత గందరగోళం మనం పడ్డా,
సంతోషంగానే వున్నాను నేను అన్నారు.
ఒక అవతార కాలంలో ఈ దేశమంతటా తిరిగాను అని గతం గుర్తుచేశారు.
ఇదన్నమాట బాబావారి ఆనందానికి కారణం. ఆది అవతారుడు జొరాస్టరు.
ఆరు వేల సంవత్సరాల క్రిందట పరిష్యా (ఇప్పటి ఇరాన్)లో అవతరించాడు.
జొరాస్టరుని భగవంతునిగా ఆరాధించిన వారు జొరాస్ట్రియన్లు.
పరిష్యా దేశస్థులు కాబట్టి పార్శీలు అయ్యారు.
పరిష్యా ఇరాన్‌గా మారాక ఇరానీలు అయ్యారు.
మహమ్మద్ ప్రవక్త అవతరించాక జొరాస్ట్రియన్లకి కష్టాలు ఎదురయ్యాయి.
చాలామంది కట్టుబట్టలతో మన దేశానికి వచ్చారు.
ఇప్పటి గుజరాత్‌లో తలదాచుకొన్నారు.
దరిమిలా బొంబాయి, పుణే ఇలా అనేక ప్రాంతాలకి కదిలివెళ్ళారు.
భారతీయుల్లో ఒకరయ్యారు. వీరు మరో దేశం నుంచి వచ్చారన్న సంగతే మరచిపోయారు.
బాబావారి తల్లి షిరీన్ మాయి కుటుంబీకులు ఇలా వచ్చినవారే.
బాబావారి తండ్రి పరిష్యా నుంచి వచ్చినవారే.
అయితే ఆయన భగవదన్వేషణలో మన దేశం వచ్చారు.
జొరాస్టరుని అవతరణతో సూఫీ ఇజానికి శ్రీకారం చుట్టబడింది.

ప్రేమ, భక్తితత్వం సూఫీ ఇజం.
మహమ్మద్ ప్రవక్త కాలంలో సూఫీ ఇజంపై తెరపడిందని బాబావారే స్వయంగా వెల్లడించారొకసారి. అందుకనే కామోసు సూఫీ ఇజం రీవోరియంటెడ్ అన్న సంస్థని అమెరికాలో నెలకొల్పింది. బాబావారి వచనం – భగవద్వచనం ఆ సంస్థ ప్రచురించింది. బాబావారి గురించి వస్తున్న అనేక పుస్తకాలనీ ప్రచురిస్తున్నది ఆ సంస్థ.
ఇంతకీ సూఫీ ఇజం రీవోరియెంటెడ్ అన్న నామకరణం చేసింది ఆదీకె. ఇరానీ గారు. అదీ బాబావారి కోరిక మేరకే అనుకోండి.
సరే మళ్ళా మనం ఖొర్రం షహర్ రేవు దగ్గరికి తిరిగి వస్తే,
బాబా పుస్తకాలు వగైరా వాపసు ఇమ్మని ఎంతగా అడిగినా ససేమిరా అన్నారు అధికార్లు. వాటిని మా దేశ రాజధాని టెహ్రాన్‌కి పంపించాం.
పై అధికారులు చూసి, ఓ నిర్ణయం తీసుకొంటారు.
వీటిల్లో అభ్యంతరాలు ఏమీ లేవంటే మీకు వాపసు వస్తాయి, మీ వస్తువులు అన్నారు.
సరే, ఏం చేస్తాం! అనుకొంటూ
వుండటానికి ఓ ఇల్లు కావాలి కదా, ఎక్కడయినా దొరుకుతుందేమో చూద్దామని బయలుదేరారు. రెండు రోజులు నగరమంతా తిరిగాక ఓ సాధువు సాయంతో ఇల్లు అద్దెకు కుదిరింది. హమ్మయ్య అని ఊపిరి పీల్చుకొన్నారు అందరూ.
అప్పుడు బాబావారి తమ్ముడు జాల్ ఏమన్నారో తెలుసా?
పరిష్యా ద్రాక్ష పళ్ళకి పెట్టింది పేరు. రావ్ సాహెబ్ తల అంత పెద్ద ద్రాక్ష పళ్ళు దొరుకుతాయన్నారు. అంత పెద్దవి కాకపోయినా చిన్న సైజు ద్రాక్షలూ, దానిమ్మ పళ్ళు ఎక్కడా కనిపించవే అన్నాడు. అందరూ పొట్ట చెక్కలయ్యేలా నవ్వారు.
మొహమ్మేరా, అదే ఖొర్రం షహర్‌కి రావ్‌సాహెబ్ గారు కూడా రావాలి.
బాబావారు వచ్చేసరికి, నువ్వు రావాలి అని అతనికి కరాచీ నుంచి కబురు పంపారు.
కానీ ఏమయిందో ఏమోకానీ ఆయన జాడ లేదు. ఎక్కడున్నాడో తెలీదు.
ఏదైనా చిక్కుల్లో పడ్డాడేమో! ఈ ఆలోచన రాగానే అందరికీ భయం పట్టుకుంది.
ఎందుకంటే, అబ్దుల్లా, ఆఘా ఆలీ, ఆలీ అక్బరు కూడా రావ్‌సాహెబ్ వెంట వస్తున్నారు.
తాను ఒక్కడే అయితే ఏదోలాగా తప్పించుకొంటాడు.
అభం శుభం తెలియని పిల్లల్తో ఎన్ని ఇబ్బందులు పడ్తున్నాడో అని మండలివారికి దిగులుపట్టింది. పరిష్యాలో తెలిసినవారందరికీ బాబావారు టెలిగ్రాములు పంపారు.
మా రావ్‌సాహెబ్ జాడ తెలిస్తే చెప్పండి. ఇది ఆ టెలిగ్రాముల సారాంశం.
దీనితో మండలివారి గుండె గుభేలుమంది. ఏదో అయింది, లేకపోతే బాబావారు టెలిగ్రాములు పంపుతారా అనుకొన్నారు. ఏమి చేయాలో పాలుపోలేదు.
గమ్మత్తు ఏమిటీ అంటే, రావ్‌సాహెబ్, పిల్లల్తో వస్తున్న బస్సు పాడయింది.

అదీ మొహమ్మే దగ్గరపడుతుంటే. రిపేర్లకి మూడురోజులు పట్టింది.
ఆ మూడురోజులు వాళ్ళు రోడ్డు ప్రక్కనే జాగారణ చేశారు.
రావ్‌సాహెబ్ బాబావారికి టెలిగ్రాం పంపవచ్చు
అతగాడు అలాచేస్తే మన కథ మరోమలుపు తిరిగేది.
మరి రావ్‌సాహెబ్ టెలిగ్రామ్ పంపలేదు. ఎవరితోనూ కబురూ పంపలేదు.
ఎందుకనో ఏమో! బహుశా బస్సు ఆగిన ఊళ్ళో టెలిగ్రామ్ పంపే వీలు
వుండి వుండకపోవచ్చు. "ఇదిగో రిపేరు అయిపోవచ్చింది.
బస్సు ఇహ కదుల్తుంది" అనుకొన్నాడేమో?
మొహమ్మేరా పెద్ద దూరం కాదు కదా.
బస్సు బయలు దేరిందీ అంటే చిటికెలో బాబావారి సమక్షంలో వుంటాము కదా
అన్న ధీమా కావచ్చు అతనిది. ప్రభు నామ స్మరణ మాకు శ్రీరామ రక్ష.
ఈ సంగతి మండలివారికీ తెలుసు కదా.
అందుకని గాభరా పడరు వాళ్ళు అనీ అనుకొని వుండవచ్చు.
ఏది ఏమయితేనేం, మేము కొంచెం ఆలస్యంగా వస్తున్నాం అన్న కబురును
రావ్‌సాహెబ్ పంపలేదు. వస్తామన్న మూడు రోజులకి మొహమ్మేరా చేరాడు.
అప్పుడు బాబావారి ఇంట మండలివారు వీళ్ళ గురించి మాట్లాడుకొంటున్నారు.
కనీసం ఈవాళయినా వస్తారా? ఈవాళ అయినా వస్తే బాగుండును అనుకొంటున్నారు.
ఇంతలో తలుపు చప్పుడయింది.
తలుపు తీస్తే ఎదురుగా రావ్‌సాహెబ్, ముగ్గురు పిల్లలు కనిపించారు.
ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బు అయ్యారు. వీరి రాకని బాబావారూ గమనించారు.
చిరు దరహాసంతో తాను ఆనందం వ్యక్తం చేశారు.
సెప్టెంబరులో కూడా పరిష్యాలో చలి ఎక్కువే.
ఇస్ఫహాన్, యెజ్డ్‌ల్లో గజగజ వణికిస్తుందట చలి.
ఈ మాటే అన్నాడు జాల్, మారుతీ పటేల్‌తో.
అతగాడి అలవాట్లు తెలుసు కాబట్టి ఓ ఆటపట్టించాడు.
నీకు తెలుసా మారుతీ, అక్కడ అదే ఇస్ఫహాన్‌లో యెజ్డ్‌లోనూ చుక్కపడకపోతే
చలికి తట్టుకోలేరుట. మనమూ ఆ రెండు ఊళ్ళకీ వెడుతున్నాము కదా.
మరి మనం కూడా అక్కడ ప్రాణాలతో వుండాలంటే రెండు మూడు చుక్కలేం ఖర్మ
సీసానే పట్టించాలి అన్నాడు. ఈ మాట వింటూనే మారుతీ పటేల్ గుండె గుభేల్‌మంది.
సారా త్రాగినవాడు చెడిపోయినవాడి క్రింద లెక్క అతని దృష్టిలో.
శౌర్యానికి పేరుపడ్డ మరాఠీల వంశంలో పుట్టాడు.
సారా, పాను వాళ్ళ ఇంటావంటా లేదు.

అయినా ఈ దేశం కాని దేశం వచ్చింది త్రాగడానికా?
చలి వస్తే చస్తాను కానీ మందుముట్టేది లేదు అని ఒట్టు వేసుకొన్నాడు.
బాబావారికీ మాటే చెప్పాడు.
అతని అమాయకత్వం చూసి, బాబావారు పకపకా నవ్వారు.
చుక్క వేసుకోవాలని బెంగ పెట్టుకోవద్దన్నారు.
ఈ దేశంలో చలి కొంచెం ఎక్కువే అనుకో అయినా ఫరవాలేదన్నారు.
చుక్క చింత నీకెందుకన్నారు. శాకాహారం దొరక్కపోతే మాంసాహారం తీసుకోవటం లేదా అని అడిగారు. ఏదో ఒకటి తినాలి కదా బాబా అన్నాడు మారుతి.
ఇదీ అంతే అన్నారు. మందు ప్రస్తావన వ్యర్థ ప్రస్తావన అని తేల్చిచెప్పారు.
మధువు మంచి చెడులు వివరించారు. ఆరోగ్యంగా వుండాలన్నా,
భగవదనుగ్రహం కోసం జీవించాలన్నా మధువు పనికివస్తుందన్నారు.
మధువు మత్తు ఎక్కిస్తుంది, టానిక్‌లా పనిచేస్తుంది అని పేర్కొన్నారు.
ఆరోగ్యానికీ, ఆధ్యాత్మిక జీవనానికీ మత్తు, టానిక్ రెండూ అవసరమే కదా అన్నారు.
అందుకనే పూర్వకాలం, మధుపానం చేసేవారు సాధకులు.
హీరాయిన్, నల్లమందు, గంజాయి వంటివి సేవించేవారు.
కుతుబ్‌లు కూడా ఈ మత్తు పదార్ధాలని తీసుకొనేవారు.
సాయిబాబా గురించి వినే వుంటారు ఆయన హుక్క త్రాగేవాడు.
ఉపాసనీ మహరాజ్ గారయితే బీడీలు కాల్చేవారు.
అదొక నిషా. ఆ నిషాలో సాధకుడు ఆధ్యాత్మికోన్నతి వైపు అడుగులు వేస్తాడు.
ఉన్నత శిఖరాలు అధిరోహిస్తాడు.
ఈ నిషా గతితప్పితే అధోగతిపాలవుతాడు మనిషి అని బాబావారు హెచ్చరించారు.
అలనాడు మత్తుపదార్థాలని సేవించింది ఆధ్యాత్మికంగా తరించడానికేనని పేర్కొన్నారు.
సాయి కాలంలోనే మత్తు పదార్ధాల దుర్వినియోగం ప్రారంభమైందని వెల్లడించారు.
పాపం సాదాసీదా మనుష్యులకి మత్తు పదార్ధాలపై సరైన అవగాహన లేదు.
వాళ్ళకి కావాల్సింది నిషా. అందుకనే ఈ మత్తుకి బానిసలయ్యారు.
మత్తు నిషాలో తమని తాము మరచిపోయేవారు.
ఆలోచనలు తప్పుడు త్రోవ పట్టేవి. శారీరక వాంఛలకేసి మనస్సుని మళ్ళించేవి.
వాంఛలన్నింటిలోకీ కామవాంఛ అతి తుచ్ఛమైనది అని చెప్పారు.
సాధకులు కామవాంఛకి దూరంగా వుండాలని చెప్పకనే చెప్పారు.
భగవదన్వేషణ బాటలో ఎదురయ్యే పెద్ద అడ్డంకి కామవాంఛ అన్నారు.
ఆ అడ్డంకిని తప్పించుకొనే కిటుకు చెప్పారు. లంగోటి గట్టిగా బిగించి కట్టుకోమన్నారు.
లంగోటి బిగించి కట్టడమంటే? కామపూరితమైన ఆలోచనలు రానీకూడదు.

కామ ప్రేరితమైన పనులు చేయకూడదు. స్త్రీని తాకకూడదు.
స్త్రీకేసి చూడకూడదు అన్నారు. కామవాంఛ శక్తి ఎంత గట్టిదో ఎంత మనిషిని
కుదిపేస్తుందో వివరించారు. స్త్రీకేసి చూపు పడితేచాలు బుర్రని తొలిచేస్తుంది.
పాడుబుద్ధి పాడుపనికి దారితీస్తుందని అన్నారు.
తల్లీ-బిడ్డల ప్రేమస్పర్శకీ, భార్యాభర్తల ప్రేమస్పర్శకీ, తేడా వుందన్నారు.
తల్లి చేతుల్లో బిడ్డ కేరింతలు కొడతాడు.
ఒడిలో ఒదిగిపోతాడు. బిడ్డ స్పర్శలో, కామవాంఛ లేదు కాస్తయినా.
మరి అదే నీ తల్లి, తండ్రి మధ్య స్పర్శ - ఎంత కాస్తంత స్పర్శ అయినా
కామ వాంఛ పుట్టించవచ్చు అని బాబావారు పేర్కొన్నారు.
సాధకుడు కామవాంఛలకి దూరంగా వుండాలని స్పష్టం చేశారు.
ఇలా మొహమ్మేరాలో సందర్భాన్ని బట్టి అనేక ఆధ్యాత్మిక సూక్ష్మాలని బాబావారు చెప్పారు.
ఒకరోజున రావ్‌సాహెబ్‌కి కొత్త పని పురమాయించారు.
మనం పరిష్యా చూసి వద్దాం. బస్సు ఏర్పాటు చేయి అన్నారు.
బాబావారితో కలిసి మొత్తం పధ్నాలుగురికి సరిపడా బండిని కుదర్చాలి.
సరేనన్నాడు రావ్‌సాహిబ్. ఎక్కడెక్కడికి వెడతామని అడిగాడు.
ఈ మూల నుంచి ఆ మూల వరకు వెడతామన్నారు బాబా.
పరిష్యా తూర్పున వుంది. మొహమ్మేరా ఇక్కడి నంచి పశ్చిమ దిశగా ప్రయాణం చేద్దాం
అన్నారు. అప్పట్లో దారి దొంగల బెడద ఎక్కువ పరిష్యాలో.
ముఖ్యంగా మొహమ్మేరా - ఇస్‌ఫహాన్ మార్గం బందిపోటు దొంగలకి పెట్టింది పేరు.
అంటే బాబా మండలి అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రయాణం చేయాలి అన్నమాట.
పరిష్యా చక్రవర్తిగా రెజాషా సింహాసనం ఎక్కాక ప్రధాన రహదార్లలో చాలాచోట్ల
సైనిక గస్తీ బృందాలని పెట్టారు. దీనితో దొంగల బెడద కొంత తగ్గింది.
కొత్త చక్రవర్తి పాలనలో మత సహనం కూడా పెరిగింది.
1924లో బాబావారు ఈ దేశం వచ్చినప్పుడు మత విద్వేషాలు ఎక్కువగా వుండేది.
జొరాష్ట్రియన్లు అంటే మహమ్మదీయులకి పడేది కాదు అంతగా.
ఇప్పుడు జొరాష్ట్రియన్లు అంటే విముఖత తగ్గింది ఇందువల్ల,
బాబావారి బస్సు యాత్రకి మార్గం సుగమమయింది.
ఎందుకంటే బాబావారు జొరాష్ట్రియను కుటుంబంలో పుట్టారు.
ఆయన వెంటవచ్చిన వారిలో చాలామంది జొరాష్ట్రియన్లు మెహెరుడే
అలనాటి ఆది అవతారమూర్తి అని కదిలి వచ్చినవారు.
మహమ్మదీయులకీ -జొరాష్ట్రియన్లకీ మధ్య కన్పిస్తున్న సుహృద్భావం వీరందరికీ కొంత
ఊరట కల్గించింది. కానీ కొత్త చిక్కు ఎదురయింది.

పరిష్యాలో రోడ్లు చాలా అధ్వానంగా వున్నాయి.
జాగ్రత్తగా నడపకపోతే ప్రమాదం తప్పదు.
అంటే ప్రొద్దున్నే బయలుదేరినా ఎంత వేగంగా బస్సు నడిపినా, ఎక్కువ దూరం వెళ్ళలేరు.
ఏ ఊరి పొలిమేరలోనూ ఆ ఊరి పేరు బోర్డు లేదు.
అది ఏ ఊరో తెలియకపోతే దారితప్పే ప్రమాదం వుంది.
ఇంతకంటే మరో పెద్ద కష్టం పొంచి వుంది మన మండలివారికి.
శాఖాహారం మచ్చుకైనా దొరకలేదు.
చాలా ఊళ్ళలో పాపం బ్రెడ్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.
పరిష్యాలో చాలా భాగం ఎడారి.
ఇసుక మార్గంలో బస్సు నడపడం మా వల్ల కాదన్నారు చాలామంది టాక్సీ వాళ్ళు,
బస్సుల వాళ్ళు. అయితే మన రావ్‌సాహెబ్ పట్టువదలని విక్రమార్కుడు.
ఎందరినో బ్రతిమలాడి, బామాడి, ఓ మూడు కార్లు కుదిర్చాడు.
అక్టోబరు మూడవ తేదీన బయలుదేరుదాము అన్నారు బాబావారు.
సరేనన్నాడు. మిగిలిన ఏర్పాట్లలో పడ్డాడు.
పరిష్యా వచ్చినప్పటి నుంచీ బాబావారికి నలతగానే వుంది.
నోరు బాగా వాచింది. పచ్చి పుండుగా మారింది.
జలుబు, తలనొప్పి, కడుపు నెప్పి వదలనంటున్నాయి.
ఈ శారీరక బాధలు ఆంతరంగిక విశ్వ కార్యక్రమపు ప్రభావమే.
ఈ మాటే బాబావారు శెలవిచ్చారు.
"నా ఆంతరంగిక ఆధ్యాత్మిక కార్యక్రమం బాగా ఉధృతమయితే దాని ప్రభావం
నా శరీరంపై పడుతుంది. ఆ బరువు నా శరీరాన్ని కుదిపేస్తుంది.
ఇది నేను లెక్కచేయను" అని సెప్టెంబరు 30వ తేదీన శెలవిచ్చారు.
ఆవేళ గెడ్డం గీసుకున్నారు. ఎన్నో నెలలు అయింది బాబా గెడ్డం గీసి.
అడవిలా పెరిగింది. ఛాన్జీజీ కూడా గెడ్డం గీశాడు.
మొహమ్మేరాలో బాబావారున్న సంగతి ఎలా తెలిసిందో నగర పోలీసు కమీషనర్‌కీ
ఇతర పెద్ద అధికార్లకీ తెలిసింది. మెహెర్‌ని దర్శనం చెసుకోవాలనుంది
అని కబురు పంపారు. ఈ కబురు విని బాబావారు అగ్గిగుగ్గిలమయ్యారు.
ఎవరు చెప్పారు వాళ్ళకి నేనిక్కడ వున్నట్లు అని మండలిని నిలదీశారు.
తల వాచేట్లు చివాట్లు పెట్టారు. నేనిక్కడ వున్న సంగతి ఎవరికీ చెప్పవద్దని
వేలసార్లు చెప్పాను. అయినా ఎవరో నా గురించి వాళ్ళకి చెప్పారు.
నాకు నచ్చదు మీరు చేసినది. ఇక్కడ ఎవరికీ దర్శనం ఇవ్వాలని లేదు నాకు.
ఇంకెక్కడయినా దర్శనం ఇస్తాను నాకు ఇష్టమయితే,

ఇక్కడ మొహమ్మేరాలో మాత్రం దర్శనం ఇచ్చేది లేదు.
ఎన్నోసార్లు చెప్పానీ సంగతి మీకు.
కానీ ఒక్కళ్ళు కూడా నా మాట వినరు.
ఇందువల్ల ఇదిగో ఇలా లేనిపోని చికాకులు ఎదురవుతాయి అన్నారు.
సరే, బాబావారి ఉనికిని బయటపెట్టింది మన మండలివారు కారట.
ఆ ఘనకీర్తి ఓ సాధువు గారిది. ఆ మహానుభావుడే బాబావారికి ఇల్లు కుదిర్చిపెట్టింది.
బాబావారిని మొదటిసారి చూసినప్పుడు ఆయన ఎవరో తెలియదు.
అర్దేషిర్ ఇంటిని బాబావారు పావనం చేసినప్పుడు తెలిసిందా వైనం.
తనకి తెలిసిన నలుగురు పెద్దలకీ చెప్పాడు.
బాబావారికి ఎందుకనో మరి మొహమ్మేరాలో ఎవరికీ దర్శనం ఇవ్వాలనిపించలేదు.
ప్రభువుకి ఇచ్ఛ లేకపోతే చీమయినా కుట్టదంటారు.
అదే జరిగింది ఈ పరిష్యా నగరంలో కూడా.
ఎవరికీ దర్శనం ఇవ్వకుండానే బాబావారు ఇస్‌ఫహాన్‌కి కదిలారు.
అక్టోబరు 3న మూడు కార్లలో బాబావారు,
ఆయన వెంట వున్న పదమూడు మంది సర్దుకొన్నారు.
మూడు కార్లు కలిసి వెళ్ళాలి అని బాబావారు స్పష్టంగా చెప్పారు.
ప్రభువు మాట పెడచెవినిపెడితే,
ఎంత అనర్ధమో మండలివారికి తెలుసు కానీ పరిష్యన్ డ్రైవర్లకి తెలీదు.
మాటా పట్టింపులు వచ్చి ముగ్గురు డ్రైవర్లు మూడు దార్లు పట్టారు.
కొంచెం దూరం వెళ్ళారో లేదో రెండు కార్లు పాడయినై.
బాబావారి కారుకి ఏమీ కాలేదు.
రావ్‌సాహెబ్‌నీ ముగ్గురు పిల్లల్నీ తమ కారు ఎక్కించుకున్నారు.
మిగిలిన వాళ్ళ కోసం ట్రక్కు కుదిర్చారు.
మన పెట్టెలు, బెడ్డింగ్‌లు ట్రక్కులోనే తీసుకురండి అని చెప్పి తమ కారు ఎక్కారు.
అక్టోబరు 15న ఇస్‌ఫహాన్ చేరారు.
అంటే పదకొండు రోజులు పట్టిందీ యాత్ర.
ట్రక్కువారు మరో రెండు రోజుల తర్వాత వచ్చారు.
దారిలో ట్రక్కు పాడయిందట ఒకసారా రెండుసార్లా చాలాసార్లు పాడయిందట.
పాపం వాళ్ళ కష్టాల్ని మాటల్లో చెప్పలేము.
ఇంతకీ ఏమయిందీ అంటే ట్రక్కు డ్రైవరు కాస్తంత కక్కుర్తిపడ్డాడు.
మన మండలికి చెప్పకుండా 14 పంచదార బస్తాలు ఎక్కించాడు.
మండలివారివే 79 మూటలు. వెరసి మొత్తం 93 బస్తాలు,

సామన్ల మూటలు ఇంత బరువు నావల్ల కాదని ట్రక్కు మొరాయించింది.
టైరు పగిలింది. అది నిర్జన ప్రదేశం.
ఇప్పుడే వస్తా, కొత్త టైరు తీసుకొని అని వెళ్ళాడు డ్రైవరు.
మన మండలివారు ఏం చేస్తారు డ్రైవరు వచ్చేవరకు అక్కడే ట్రక్కు ప్రక్కనే జాగరణ చేశారు. రోడ్డు ప్రక్క పొల్లాల్లో దోసకాయలు తిని కడుపు నింపుకొన్నారు.
రెండు రోజులకి వచ్చాడు డ్రైవరు.
కొత్త టైరు బిగించాడు. హమ్మయ్య అనుకొంటూ అందరూ ట్రక్కు ఎక్కారు.
రైట్ చెప్పారు. బండి కదిలింది. మళ్ళీ రెండు చోట్ల మొరాయించింది.
ఒక మజిలీ – రెండు పగళ్ళు, ఒక రాత్రి.
అక్కడ మాంసం, గ్రుడ్లు తప్ప ఇంకేమీ దొరకవన్నారు.
మళ్ళీ దోసకాయలే మనవారికి పంచభక్ష పరమాన్నాలు అయినై.
ఇహ రెండో మొరాయింపు మజిలీ కొండల్లో.
ఏడువేల అడుగుల ఎత్తు కొండల మధ్య రోడ్డుపై ఆగింది ట్రక్కు.
ఎప్పటిలాగే బానెట్ తెరిచాడు డ్రైవరు.
ఇప్పట్లో కాదీ పని అంటూ పెదవి విరిచాడు.
చీకటి పడుతోంది. రేపు ప్రొద్దున్నే ఏమయినా చేయగలం అన్నాడు.
హతవిధీ అనుకొన్నారు మండలివారు. తలదాచుకొనే గూడు కనబడలేదు.
చలి ఎముకలు కొరుకుతోంది.
గజగజ వణుకుతూ ట్రక్కులోనే ముడుచుకొని కూర్చున్నారు.
కడుపులో ఎలకలు పరుగెడుతున్నాయి.
బాబా నామం చెప్పుకొంటూ నిద్రని ఆహ్వానించారు.
ఇంతలో డ్రైవరు వచ్చి గాఢ నిద్రపోకండి అని హెచ్చరించాడు.
మండలి: "ఇప్పుడేమయింది"?
డ్రైవరు: ఈ కనుమ దొంగల నిలయం ఏ మూల నుంచి ఎవరు వస్తారో చెప్పలేము.
ఒక్కసారి వచ్చి మీద పడ్తారు. దోచుకుపోతారు.
మండలివారికి బేజారెత్తింది. "ఆపద్బాంధవా!
నీవే మాకు దిక్కు ఈ కొండల్లో", అని మనసారా బాబా నామం చెప్పుకొన్నారు.
ఆ రాత్రి గండం గడిచింది. ట్రక్కు ఉదయాన్నే బయలుదేరింది.
కొండ కనుమ దాటింది. నరసంచారం వున్న ప్రాంతంలో అడుగుపెట్టింది.
ఇహ నావల్ల కాదంటూ చతికిలబడింది.
డ్రైవరు ఎన్ని తిప్పలు పడ్డా నీ మొర ఆలకించను అంది ట్రక్కు.
సరే ఏం చేస్తామని మండలివారు బస్సు కుదుర్చుకుందామనుకున్నారు.

అద్దె బస్సు దొరికేసరికి రెండురోజులు పట్టింది. బ్రతుకు జీవుడా అనుకొంటూ బస్సు ఎక్కి, అక్టోబరు 17న బాబావారి సమక్షానికి వచ్చారు.
అలసి, సొలసి వచ్చాము స్వామి అన్నారు.
పదమూడు రోజుల ప్రయాణంలో ఒళ్ళు హూనమయింది అని మనవి చేశారు.
ప్రభువు చిరునవ్వు నవ్వారు. నాకు తెలియకపోతే కదా మీకథ అన్నట్లుంది ఆ చిరునవ్వు.
వీళ్ళకి బస మంచి హోటలులో ఏర్పాటు అయింది.
“అస్రే తలాయి”, ఆ హోటలు పేరు.
ఇస్‌ఫహాన్‌లో వున్న మంచి హోటల్లో ఒకటి.
ఛాంజీ గారికి, కరీం గారికి ఒళ్ళు కాలిపోతుంది.
జ్వరం బాగా వుంది అన్నారు చూస్తున్నవాళ్ళు. కరీం మన స్పృహలో లేడు.
నోరు తెరవలేకపోతున్నాడు. అయ్యో పాపం!
ఎక్కువసేపు బ్రతకడేమో అనిపించింది చూస్తున్నవాళ్ళకి.
కానీ బాబావారు కరీం గోడు పట్టించు కోలేదు సరికదా అతనికేసి కూడా చూడలేదు.
మండలివారిని ఉభయకుశలోపరి చేశారు.
మీ ప్రయాణం బాగా జరిగిందా అని అడిగారు.
ఓ గంట పోయాక కరీం కేసి చూశారు.
**బాబా:** ఎవరా మూల పడుకున్నది.
**మండలి:** మన కరీం బాబా!
అపస్మారకంగా పడివున్నాడు వచ్చినప్పటి నుంచి. నాడి అందటంలేదు.
బాబావారు కరీం కేసి మరోసారి చూశారు. వేడి టీ తెమ్మన్నారు.
కరీం నోరు తెరిచి, ప్రేమగా చెమ్చాతో త్రాగించారు.
అంతే కాసేపటికి కరీంలో చలనం వచ్చింది. చెమటపట్టింది.
ఓ గంట సేపటికి స్పృహలోకి వచ్చాడు.
పూర్తిగా కోలుకొనేసరికి రెండురోజులు పట్టింది.

**–సశేషం**

# బాబాలో ఐక్యం

**ఖమ్మం బాబా సెంటర్ ప్రేమికులు శ్రీ యం. అత్యుతరావు (86) జూలై 1వ తేదీన స్వల్ప అస్వస్థతతో తుదిశ్వాస విడిచారని శ్రీ ఆర్. రామచంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు.**



# శ్రీమతి సీతామహాలక్ష్మి

శ్రీ డి.సంజీవరావు గారి భార్య శ్రీమతి సీతామహాలక్ష్మి జూలై 16న రాత్రి 10 గంటలప్పుడు బాబా నామస్మరణచేస్తూ తుదిశ్వాస విడిచారు. హైదరాబాద్‌లోని కోఠి సెంటర్ వ్యవస్థాపకులు శ్రీ నోరి సూర్య ప్రకాశరావు గారి మనుమరాలు. మధుర గాయకుడు సో. గోపి ఈమె కూమారుడే. ఒక్క మాటలో చెప్పాలంటే, వీరి యావన్మంది కుటుంబ సభ్యులు బాబా ప్రేమికులే!!.

బాలాంత్రపు వారింట శునకానికి సంగీతం అబ్బిందన్నారు. అలా వీరింట్లో ప్రాణం పోసుకున్న ప్రతి ప్రాణీ బాబా నామ స్మరణలో తరిస్తున్నారనొచ్చు.

జూలై 27న సా.4 నుండి 8 గంటటల దాకా కోఠి సెంటర్‌లో ప్రత్యేక బాబా సత్సంగ్ నిర్వహించారు. బాబా ప్రేమికులు శ్రీ కొత్ర వెంకటరావు, శ్రీ బి. రామక్రిష్ణయ్య, శ్రీ బాలాజీ, ప్రసంగించారు. శ్రీ తోట నాగేశ్వరావు తన ప్రసంగంలో బాబావారి ప్రవచనం చక్కగా వివరించారు. బాబావారి సందేశం ఇలా వుంది.

సద్గురువులు, అవతారులకి మరణం అంటే పట్టదు. ఎవరు కన్నుమూసినా వాళ్ళ కళ్ళు చెమర్చవు. ఎందుకోతెలుసా? బ్రహ్మాండమంతా వాళ్ళ దృష్టిలో చాలా చిన్న బిందువు వంటిది. మానవశరీరాన్ని కొబ్బరికాయ పీచుతో పోల్చవచ్చు. పీచు మొత్తం పీకేసినా, కొబ్బరికాయ ఏమీ కాదు కదా. అలానే ఆత్మకు కూడా చావులేదు. ఎన్ని వేల శరీరాలు పడిపోయినా, ఆత్మకి ఏమీ కాదు. ఆత్మ అనశ్వమైనది. ఆకలివేస్తే మీరు భోజనం చేస్తారు. తిన్న అన్నం అరిగాక, శంక నివృత్తి అంటారు. కాలవ గట్టుకో, మరుగు దొడ్డికో వెడతారు. మీ శరీరంలో నుంచే వస్తోంది మలమంతా. అయ్యో ఇది నాది. నా శరీరంలోది. నా మలం అంటూ కంట తడి పెడతారా? లేదు కదా? మరి ఎవరైనా కన్నుమూస్తే, మీరెందుకు కంటతడిపెడతారు. ఆత్మకి ఆహారం వంటిది శరీరం. మరి ఆ శరీరాన్ని ఆత్మ వదిలివేస్తే బాధపడడం దేనికి. ఆత్మకోసమే శరీరం. ఆత్మ పురోగతికి శరీరం వొక మాధ్యమం. శంకా నివృత్తి అయ్యాక, శరీరం తేలిక పడుతుంది. మళ్ళీ ఆకలివేస్తుంది. ఏదో వొకటి నోట్లో తీసుకొంటారు. అలానే ఆత్మ కూడా పాత శరీరం వదిలిపెట్టాక ఇంకో శరీరంలోకి వెడుతుంది. ఇంత దాని కోసం ఎందుకు బాధపడతారు. ఇంకోమాట. వొక శరీరాన్ని వదిలి మరో శరీరంలోకి ఆత్మ వెళ్ళడం, అదే చావు, పుట్టకలు, సృష్టిలో సహజం. ఈ ప్రకృతి నియమాన్ని ఎవరూ మార్చలేరు అని బాబావారు పేర్కొన్నారని శ్రీ రావు తెలిపారు. అనంతరం, ప్రార్థనలు, ఆరతితో కార్యక్రమం ముగిసింది.

# హిందీ సహవాస్

బాబా మాట్లాడుతూ జలుబు, దగ్గుల గురించి నేను భయపడుతున్నానన్నారు. ఎందుకంటే అవి అంటువ్యాధులన్నారు. అవి తనకు సోకకుండా దీవించమని మండలి సభ్యుడైన కైకోబాద్‌ను కోరారు. కైకోబాద్ బాబాను దీవిస్తూ...

మీకు ఈ జలుబు, దగ్గులు సోకవని దీవించాడు. నీవెప్పుడూ ఇలానే దీవిస్తావులే!! అని బాబా నవ్వుతూ అన్నారు.

ఆ తర్వాత ఈ విషయమై మెహెర్‌బాబా ఒక సుదీర్ఘమైన ప్రవచనాన్ని సహవాసీలకిచ్చారు. జలుబు, దగ్గు గురించి చెప్పేముందు గత వారంలో గుజరాతీ, తెలుగు సహవాసీలకు చెప్పిన విషయాలను క్లుప్తంగా చెప్తానన్నారు.

ఈ స్థూల ప్రపంచంలో మానవదేహం ఏదో ఒకనాడు అనారోగ్యానికి గురి కావల్సిందే. అయితే, భగవంతుని ప్రేమలో అంకితమైనవారి దేహాలకి ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. వారిలో రగులుతున్న భగవత్ప్రేమ వారి దేహాలదరిదాపులకి రోగాలను రానివ్వకుండా కాపాడుతుంది. భగవంతుని ఎడల మస్తుల యొక్క ప్రేమ దేనితోనూ సరిపోల్చలేము. వారు అనుక్షణం భగవంతుని ప్రేమలోనే మునిగి వుంటారు. అలా చాలా కొద్దిమంది మాత్రమే వుంటారు.

అలాంటివారిపై ఎలాంటి రోగాల ప్రభావం వుండదు.

ఇస్లాంపూర్ అనే ప్రాంతంలో ధోండి బువా అనే మస్తు వున్నాడు.

అతను ఎత్తుగా, లావుగా, ఆరోగ్యంగా వుంటాడు. బయట ఎంత చలి, వేడి, మంచు కురుస్తున్నా అతనికి జలుబు, దగ్గులు అంటవు. అతనికి వేళకు తిండి తినాలని కూడా వుండదు. అప్పుడప్పుడు తనకు తెలిసినవాళ్ళ ఇంటికి వెళ్ళి వాళ్ళు పెట్టింది తిని తృప్తిగా తనమానాన తానుంటాడు. అతనిలో దైవీప్రేమ కణకణమంటూ మండుతుంటుంది. అతని దేహానికి మనస్సుకి ఎలాంటి సంబంధం లేదు.

నఖ శిఖ పర్యంతం, తల నుండి కాలి చిటికిన వేలి గోరు వరకు అన్నట్లు దైవీప్రేమతో నిండివున్నాడు. అందువల్ల అతనికి ఎలాంటి రోగాల భయమూ లేదు.

ఇదంతా భగవత్ప్రేమికులకు సంబంధించినది.

అలాగే, భగవత్ సాక్షాత్కారం పొంది, తిరిగి సాధారణ భౌతిక చైతన్యం పొందినవారిపై కూడా ఎలాంటి రోగాల ప్రభావం వుండదు.

ఎందుకంటే, వారికి వారి దేహంతో సంబంధం వుండదు.

కాబట్టి ఎలాంటి రోగాలు వారి దరిదాపులకు రావు.

వీరినే మజూబ్‌లు అంటారు. కాని భగవత్ సాక్షాత్కారం పొంది,

సాధారణ భౌతిక చైతన్యంతో మానవాళి మధ్య తిరుగాడుతుండే వారికి మాత్రం అన్ని రకాల రోగాలు, ఒక సాధారణ మానవుని మాదిరిగానే అంటుకునే అవకాశం వుంది.
ఇకపోతే మీకు–నాకు గల బేధం ఏమిటి? అని బాబా ప్రశ్నించారు.
ఈ దేహం ఒంటిపై వేసుకున్న చొక్కా లాంటిది.
ఇదిగో నా దేహంపై ధరించిన ఈ గులాబి కోటు లాంటిది నా ఈ దేహం.
ఇదేదో కేవలం నా నమ్మకమో లేదా నాకు లభించిన జ్ఞానమో కాదు.
నేను ఇది అనుక్షణం అనుభవిస్తున్నాను. నేను నా అనుభవంతో చెప్తున్న మాటలివి.
ఇలాంటి అనుభవం మీకుండదు. మీరందరూ నాలో వున్నారు.
మీరందరూ నా వాళ్ళు. ఇది నేను అనునిత్యం, అనుక్షణం అనాదిగా అనుభవిస్తున్నాను.
నేను మీలో వున్నాను. ప్రతి ఒక్క జీవరాశిలోనూ వున్నాను.
ఇది నా దైవత్వంతో, సాధికారకంగా చెప్తున్నాను.
ఇక కైకోబాదు విషయానికి వద్దాం. అతడిని తరచు నా తలపై చేయిపెట్టి దీవించమని అడుగుతుంటాను. కైకోబాదు నన్ను అమితంగా ప్రేమిస్తున్నాడు.
అనుక్షణం నా దర్శనం అతను అనుభవిస్తున్నాడు.
24 గంటలలో అతను ఎక్కడున్నా అతను కోరిన సమయంలో, కోరిన ప్రదేశంలో అతను నన్ను దర్శించుకుంటున్నాడు. అతను అనుక్షణం రాత్రింబవళ్ళు నా నామం స్మరిస్తున్నాడు. అతను చీకట్లో వున్నా నన్ను చూడాలనుకున్నప్పుడు ప్రకాశవంతమైన కాంతిని అతను సృష్టించుకుంటాడు. ఇంత శక్తివంతుడైనప్పటికీ ఆతనికి బ్రహ్మైక్య సాధన చాలా చాలా దూరంలో వుంది. కైకోబాదు తన సర్వస్వం నాకు అర్పించాడు.
నా తలపై చేయి వుంచి దీవించమంటే అతను కొన్నిసార్లు తటపటాయిస్తాడు.
కళ్ళంబడి నీళ్ళు పెడతాడు. బాబా! నీవెవరో నాకు తెలుసు.
సాక్షాత్తు భగవంతుడివి. నన్ను దీవించమని ఎందుకు అడుగుతావు.
నీవు అన్నింటా వున్నావు. నేను నిన్ను దీవించడమేమిటని అడుగుతుంటాడు.
అది నా ఆజ్ఞ. అతను విధేయతతో పాటించాల్సిందే.
ప్రేమకన్నా గొప్పది విధేయత.
ఆధ్యాత్మిక అనుభవాలలో **విధేయత అన్నింటికన్నా గొప్పది**.
మీలో ప్రతిఒక్కరూ, నా మండలి సభ్యులలో ప్రతిఒక్కరూ, అన్ని జీవరాశులూ భగవత్ స్వరూపులే. ఎలా? అని ప్రశ్నిస్తే అది నాకు తెలిసిన విషయం.
ఈ యావత్తు సృష్టిని సృష్టించింది నేనే. నేనే లేకపోతే, మరేమీ వుండదు.
మీరు ఉండరు. ఈ సృష్టి వుండదు. నా ఉనికి వల్లనే ఈ యావత్తు సృష్టి ఉంది.
ఉదాహరణకు నిరంజన్ సింగ్‌ను తీసుకుందాం.
నిరంజన్ సింగ్ కనుక లేకపోతే ఆతనికి సంబంధించిన ఈ సమాజం ఏముంటుంది?

నిరంజన్ ప్రతిరోజు ఈ సృష్టిని, తన చుట్టూవున్న సమాజాన్ని చూస్తుంటాడు. తన చుట్టూ జరుగుతున్నది చూస్తున్నాడు. అయితే నిరంజన్ మంచి గాఢ నిద్రలో వున్నాడనుకుందాం. ఆ గాఢనిద్రలో ఆతని చుట్టుప్రక్కల ఏం జరుగుతోందో అతనికేమీ తెలియదు. అంతవరకు ఆతనిని అంటిపెట్టుకుని వున్న సమాజం ఇతరత్రా ఏమైనట్లు? అవన్నీ ఎటుపోయాయి. నిరంజన్ గాఢ నిద్రలో వున్నంత వరకు ఆతని దేహంతో ఎలాంటి సంబంధం వుండదు. నిద్ర నుంచి లేవగానే తిరిగి అన్నీ తన చుట్టూ కనిపిస్తాయి. ఇది ఒక్క నిరంజన్‌కి సంబంధించిన విషయం మాత్రం కాదు. ఇది అందరికీ అనుభవపూర్వకమే.

ప్రతిరోజూ మీరు మంచి నిద్రలోకి జారుకున్నప్పుడు మీరు భగవంతునికి ఆవలి స్థితికి (బియాన్డ్ బియాన్డ్ స్టేట్ ఆఫ్ గాడ్) చేరతారు. ఆ స్థితిలో ఏమీ వుండదు.

మీరు నిద్ర నుండి క్రమంగా మెళుకువలోకి వచ్చేటప్పుడు,

ముందుగా మీరు కలల ప్రపంచంలో అడుగుపెడతారు.

ఆ తర్వాత క్రమంగా పూర్తిగా మెళుకువ వచ్చాక మీ చుట్టూతా ఎప్పటిలా

అన్నీ కనబడటం ప్రారంభిస్తాయి. నిద్రపోయినప్పుడు మాత్రం

ఈ ప్రపంచం మాయమౌతుంది. మెళుకువ రాగానే తిరిగి ప్రత్యక్షమౌతుంది.

ఒకవేళ నిరంజన్ ఎప్పటిలా గాఢ నిద్రలోకి జారుకున్నప్పుడు,

ఆ గాఢనిద్రలో సంపూర్ణంగా మెళుకువగా వుండగల్గితే, అది వేరే విషయం.

ఈ స్థితిని కాన్షియస్ స్టేట్ ఆఫ్ గాడ్ అంటారు.

ప్రతిరోజు ప్రతిఒక్కరూ ఎలాంటి చైతన్యం వుండని భగవంతునికి ఆవల గల స్థితిని, (బియాన్డ్ బియాన్డ్ స్టేట్ ఆఫ్ గాడ్) పరబ్రహ్మ పరమాత్మ స్థితికి వెళ్తారు.

ఇది మంచి గాఢ నిద్రలోనే జరుగుతుంది.

భగవంతుడు ఈ పరబ్రహ్మ పరమాత్మ స్థితిలోనే, యావత్ ప్రపంచాన్ని చూడగల్గుతాడు.

అలాగే ద్వందంలో తన స్థితిని అనుభవిస్తాడు.

సాధారణ మానవుల విషయంలో గాఢ నిద్రలోకి వెళ్ళి

తిరిగి మెళుకువ రాగానే తన చుట్టుప్రక్కల గల ప్రపంచంలో మమైకమౌతారు.

గాఢ నిద్రలో వుండగానే భగవంతుని దర్శనానికై చైతన్యవంతులైతే అప్పుడు

ఈ ద్వందం అదృశ్యమౌతుంది.

గాఢ నిద్రలో వుండి సంపూర్ణ చైతన్యంతో మెళుకువగా వుండటం ఎంతో సంక్లిష్టమైనది. కష్టమైనది. అసాధ్యమైనది. ఒక్కసారి మీరు మీరుగా ఒక్క క్షణం ఊహించండి. ఐతే, నా మాటలు మీకు చమత్కారంగా వుండొచ్చు. కానీ..,

ఇది అసాధ్యమైనది ఏమాత్రం కాదు. ఇది సాధ్యమైన విషయమే.

గాఢ నిద్రలో మెళుకువతో చైతన్య స్థితిలో వుండగల స్థితి తప్పక సాధ్యమౌతుంది.

కాని, అదెప్పుడు జరుగుతుందంటే కొన్ని జన్మలు ఎత్తిన తర్వాత మాత్రమే వీలౌతుంది.
భగవంతుని ప్రేమికునిగా మారడం ఎంతో కష్టం.
అది ఎంత కష్టమో హాఫీజు రెండు మాటల్లో చెప్పాడు.
బాబా తన మండలి సభ్యుడైన అలోబాను హాఫీజు సూక్తిని బిగ్గరగా చదవమన్నారు.
భగవంతుని ప్రేమికునిగా కావాలంటే,
**భగవంతుని పాదధూళిగా ప్రేమికుడు మారాలన్నాడు హాఫీజు.**
**భగవంతుని పాదధూళిగా మారిన సుమారు లక్ష మందిలో ఏ ఒక్కడో**
**ఈ మాయా ప్రపంచాన్ని ఛేదించగల్గుతాడు అన్నాడు హాఫీజు.**
ఒకేఒక్కడు ఎందుకు విజయం సాధించగల్గుతాడు.
మిగిలినవారు ఎందుకు సాధించలేరు?
అది ఎందువల్ల అంత కష్టం? భగవంతుడనేవాడు సర్వవ్యాపి కదా?
అందరిలోనూ, అన్నింటా ప్రతిఒక్క జీవరాశిలోను వున్నాడు కదా?
అలాంటప్పుడు ఇదెందుకు అసాధ్యం? ఇందుకు,
నీకు నీవే నిందితుడివి!! నీ మనస్సు అసంఖ్యాకమైన ఆలోచనలతో నిండి వుంది.
ఏది ఊహించినా అది నీ మనస్సుతోటే చేస్తావు.
నీకు తెలుసా మనస్సులో కొన్ని వేల ఆలోచనలు ఎలా ఉద్భవిస్తున్నాయో?
నాక్కూడా తెలియదు. మీకు తెలియకుండానే ఆ ఆలోచనలు వచ్చిపడుతున్నాయి.
మీరు తీసుకునే శ్వాస గురించి ఒక్క క్షణం ఆలోచించండి.
మీకు తెలియకుండానే మీరు అనుక్షణం ఊపిరి పీల్చుకుంటున్నారు.
గాలి లోపలికి పోతుంది. బయటకు వస్తుంది.
ఉచ్ఛ్వాస నిస్వాసలు నిరంతరం మీకు తెలియకుండా మీ అనుమతి లేకుండా
సహజ రీతిలో జరుగుతోంది. మీరు మెళుకువగా వున్నా, నిద్రపోతున్నా శ్వాస ప్రక్రియ
జరుగుతుంది. అలాగే మీ మనస్సులో అనేక ఆలోచనలు నిరంతర ప్రవాహం
మీకు తెలియకుండా జరుగుతుంది. భగవంతుడు మీ శ్వాస కన్నా దగ్గరగా వున్నాడు.
అయితే, అది మీకు తెలియదు. అది గమనించరు. మీరిప్పుడు శ్వాస
తీసుకుంటున్నారు. సాధారణంగా అది దాని మానాన అది జరుగుతుంది.
అదే మీరు ఏ కొండలో గుట్టలను ఎక్కుతున్నప్పుడో లేదా
వేగంగా నడుస్తున్నప్పుడు మీరు తీసుకునే శ్వాస వేగంగా వుంటుంది.
భారంగా వుంటుంది. ఆ శ్వాస ఎలా వుంటుందో మీకు తెలుసు.
ఉదాహరణకి ఎవరైనా మీ గొంతు నులిమేయబోతే
అప్పుడు మీ శ్వాస ఎంత వేగంగా వుంటుందో, శ్వాస ఎలా వుంటుందో
మీకు అర్థమౌతుంది. శ్వాస ప్రక్రియ అంటే జీవించడమే అని మీకు తెలుస్తుంది.

## ప్రేమ రెండు స్థితులలో ఉంటుంది.

**మొదటిది** Emotional, Sentimental, Renunciatory.

రెండవ స్థితిలో ప్రేమికుడు పిచ్చివాడైపోతాడు.
తన ప్రియతముడి ఎడబాటును ఏమాత్రం తట్టుకోలేడు. అతనికి భగవంతుడే ఊపిరి. భగవంతుడు లేకుండా క్షణకాలం అతను ఉండలేడు. భగవంతునిలో లీనమయ్యేదాకా అనుక్షణం అవిశ్రాంతంగా ఉంటాడు. ఒక అందమైన అమ్మాయి ప్రేమలో పడ్డ వ్యక్తిని ఉదాహరణగా తీసుకుంటే, అతను పగటిపూట కూడా ఆమెనే కలలో వూహించుకుంటాడు. ఆమె ఎడబాటును నీళ్ళ నుండి బయటపడ్డ చేపలాగా రెపరెపలాడతాడు. ఇలాంటి కథలు మనం చాలా తెలుసుకున్నాం.
ఇది కేవలం సాధారణ మానవ ప్రేమ. అదే ఒకనికి భగవంతుడు తన ప్రేమను కానుకగా ఇస్తే అతనెంతగా భగవంతుని కోసం పరితపిస్తాడో, మాటల్లో వర్ణించలేము. ఆ ప్రేమలో భగవంతుడు కష్టాలతో నరకం చూపించినా ఆ ప్రేమికుడు ఏమాత్రం చలించడు. **భగవంతుని ప్రేమ బహుమతిగా ఏ కొద్దిమందికో లభిస్తుంది.**
అయితే, **కొద్దిమందికే** అంటే మీరు నిరాశపడొచ్చు.
నా ప్రేమను – నాపట్ల విధేయతను, ఏ కొద్దిమందికో ఎందుకు, ప్రతి ఒక్కరికీ నేను ఇవ్వగలను. మీరు ఆ బహుమతి భగవంతుడి నుండి ఐదు నిముషాలలో ఎలా పొందవచ్చో రేపు చెప్తాను. ఈ సమాజంలో వున్న ప్రతి ఒక్కరికీ ఆ భగవత్ప్రేమను బహుమతిగా ఇచ్చేందుకు నేను సిద్ధంగా వున్నాను. ఆ ఉద్దేశ్యంతోనే ఈ సహవాస్‌ను ఇక్కడ ఏర్పాటు చేశాను. ఈ బహుమతిని అందుకోడానికి ఎందరు సిద్ధంగా వున్నారో రేపు చూద్దాం. నేను మీకు బహుమతి ఇవ్వడం – మీరు తీసుకోవడం రెండూ చాలా సులువైన విషయాలే!! అదే సమయంలో చాలా కష్టమైనది కూడా.
**భగవంతుడు ఒక్కడే సత్యం, శివం, సుందరం.**
ఆ సత్యం ముందు ఈ వివరణలు, ప్రవచనములు ఇతరత్రా అన్నీ అప్రధానమే!!
వాస్తవానికి ఇదంతా ఒక పెద్ద కల. ఈ కలను మీరు అనుభవిస్తున్నారు.
మీరు చూస్తున్నదంతా వాస్తవం కాదు. ఇదంతా పెద్ద కల.
ఉదాహరణకి నిరంజన్ సింగ్ నిద్రపోతున్నాడనుకుందాం.
నిద్రపోతూ కలకంటున్నాడు. ఆ కలలో తన ఎదుట ఈ హిందీ ప్రాంతీయ సహవాసీలందరూ ఉన్నారు. వారందరకీ నేను ప్రవచనాలు చెప్తున్నట్లు కలకంటున్నాడనుకుందాం!! ఆ కలలోనే, నేను నిరంజన్‌తో మాట్లాడుతూ, ఇక లేచి కూర్చో. ఇదంతా పెద్ద కల అని అన్నాను.
ఇది కల ఎలా అవుతుంది బాబా?

బాబా!! మీరు నా ఎదురుగా వున్నారు. నా కళ్ళతో మిముల్ని చూస్తున్నాను.
మేమందరం నీ ఎదుట వున్నాం. మరి ఇది కల ఎలా అవుతుందన్నాడు?
**ఇదిలా వుంటే కొన్ని గంటల తర్వాత యధాప్రకారం నిద్రలేచాడు నిరంజన్.**
నిరంజన్‌కి అప్పుడు తెలుస్తుంది, తానింతవరకు నిద్రలో కలలో వున్నానని!!.
కలలోనే బాబాతో మాట్లాడానని అర్ధమౌతుంది.
కలలోనే "ఇదంతా కల అన్న బాబావారి మాటల" అర్థం తెలుస్తుంది.
ఇదంతా పెద్ద కల. ఆ కలలోనే నిరంజన్ నిద్రలో మరో కలలో వున్నాడు.
కానీ, మీరు చూస్తున్నదంతా పెద్ద కల అని నేనంటే మీరు వెంటనే ఒప్పుకోలేరు.
ఎందుకంటే, మీరు మెళుకువగా లేరు కాబట్టి. మీరిక్కడ కలను అనుభవిస్తున్నారు.
నా చిన్నతనంలో నేను హాఫీజు పద్యాలను ఎంతో ఇష్టంగా చదివేవాడిని.
హాఫీజ్ చెప్పిన ప్రవచనాలని నేను ఇప్పుడు అనుభవిస్తున్నాను.
హాఫీజ్ చెప్పిన ప్రియతముడిని నేనే.
యుగ యుగాలుగా నేను మీ మధ్యకు వస్తున్నాను.
నేను ప్రతి జీవరాశిలోనూ వున్నాను.
మీరు నమ్మినా నమ్మకపోయినా, అంగీకరించినా, అపనమ్మకంతో వున్నా
**ఇది నిజం. ఇది సత్యం.**
ఆ తర్వాత బాబా **నేను-నాది** అనే అంశంపై ప్రవచనం ఇచ్చారు.

**(సశేషం. వచ్చే సంచికలో తిరిగి కలుసుకుందాం!!)**

# సిరిసిల్ల

సిరిసిల్లా బాబా సెంటర్ 32వ వార్షికోత్సవం 20.06.2015 తెట్టికుంట బాబా సెంటర్ 13వ వార్షికోత్సవం 21.06.2015 ఆదివారం ఉ. 7 నుండి సా.6 వరకు ఏర్పాటు చేసినట్లు శ్రీ డి. ప్రభాకరరావు, ట్రస్ట్ చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. మెహెరాబాద్ నుండి శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరి, శ్రీమతి రాజశ్రీ కల్చూరి, శ్రీ ఎస్.వి. మెహెర్ ప్రసాద్ రాజు, హైదరాబాద్ తదితరులు పాల్గొన్నారు. మెహెర్‌నాథ్ కల్చూరి గారి ప్రసంగమునకు తెలుగు అనువాదము శ్రీ కె. రాంచెందర్, రామాయంపేట చేశారు. ఇటీవల బాబాలో ఐక్యమైన బాబా ప్రేమికులు సో. సామల రాజమల్లయ్య గారి ఆత్మశాంతికి మౌనం పాటించారు. పండుగ రమణ, హైదరాబాద్, స్వీయరచనలో చేసిన పలు బాబా కీర్తనలు సభికుల మనస్సులు దోచాయి. పలు తెలుగు జిల్లాల నుండి బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# మౌనంలో మెహెరాబాద్



అవతారుని 90వ మౌనవార్షికోత్సవం జూలై 10న ఘనంగా ముగిసింది.
తెలుగునాటగల అన్ని బాబా సెంటర్లలో బాబా ప్రేమికలు మౌనం పాటటించినట్లు,
ఆ మేరకు నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసినట్లు సమాచార భోగట్టా.
కాగా, కొంతమంది తెలుగువారు ఎప్పటిలా మెహెరాబాద్ వెళ్ళారు.
ఈ దఫా మెహెరాబాద్‌కు సుమారు 3 వేల మందికి పైగా బాబా ప్రేమికులు
పలు ప్రాంతాల నుండి వచ్చారని అంచనా.
జూలై 9 నాటికే మెహెరాబాద్‌కు చేరిన బాబా ప్రేమికులు చాలామంది
జూలై 13 దాకా బాబా సమక్షంలోనే గడిపారు.
జూలై 12న సాయంత్రం 6.45 నిముషాలకు ధుని ప్రజ్వలన జరిగింది.
ఆ రోజున మెహెరాబాద్‌లో బాబా సమాధి దగ్గర సా. 5.45 నిముషాలకే
బాబాకు ప్రార్థన, ఆరతి ఇచ్చారు.
అనంతరం, దిగువ మెహెరాబాద్‌లో ధుని కార్యక్రమంలో పాల్గొన్నారు.
నేతిలో ముంచిన ఒక్కొక్క గంధపు చెక్క ముక్కను ప్రతివారికీ ధునిలో వేసేందుకు

ఇచ్చారు. ఈ దఫా మెహెరాబాద్‌లో ఎండల తీవ్రత ఎక్కువగానే వుంది. వర్షం కురిసే అవకాశం ఎక్కడా కనిపించ లేదు.
సాయంత్రాలు చల్లబడినా పగలు తీవ్రంగానే వుంది.
ప్రతి ఏడాది మాదిరి కనీసం వర్షపు జల్లుల ఛాయలు కూడా ఈ ఏడాది లేదు.
ట్రస్టు వారు బాబా ప్రేమికలను జూలై 9, తిరిగి జూలై 12న మెహెరాజాద్‌కు ప్రత్యేక బస్సుల్లో తీసుకెళ్ళారు.

## క్రొత్త పుస్తకాల ఆవిష్కరణ

రాజాం సెంటర్ తరపున ప్రచురించిన శ్రీ శ్రీనివాసరావు గారు రాసిన అవతారుని మధుర భక్తి గీతాల పుస్తకం **మెహెర్ దివ్య గీతావళి** జూలై 9న ట్రస్టు చైర్మన్ శ్రీ శ్రీధర్ కేల్కర్ అవిష్కరించారు. అనంతరం, సాయంత్రం 4.30 నుండి 5.30 దాకా ఆ పుస్తకంలో వున్న భక్తి గీతాలాను శ్రీ పి.వి. శ్రీనివాసరావు బృందం స్థానిక ఏ హాస్టలులో ఆలాపించారు. ఈ భక్తి గీతాల పుస్తకాలు శ్రీ పి.వి. రమణ మూర్తి, రాజాం నుండి పొందవచ్చని, పుస్తకం వెల రూ. 15గా నిర్ణయంచామని తెలిపారు. అరుదైన భక్తిగీతాల సమాహారంగా ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దినట్లు శ్రీ రమణమూర్తి తెలిపారు.
జూలై 10, మౌన దినోత్సవం నాడు శ్రీ అన్నా ఖండాలే సంకలనం చేసిన స్పార్క్స్ ఆఫ్ సైలన్స్, అవతారుడిచ్చిన ప్రవచనాలుగల ఇంగ్లీషు పుస్తకాన్ని తెలుగులో **మౌనం నుండి వెలువడిన నిప్పు రవ్వలు** శీర్షికతో విజయనగరం జిల్లా చీపురుపల్లి సెంటర్ తరపున శ్రీ పెద్ది మహేశ్వరరావు ప్రచురించి, అందరికీ ఉచితంగా అందజేశారు.
జూలై 10, 11 తేదీలలో దిగువ మెహెరాబాద్‌లోని ఏ- హాస్టల్‌లో ఉదయం, సాయంత్రాలు రెండు పూటలా అరుదైన బాబా చలనచిత్రాలను ప్రదర్శించారు. డి- హాస్టల్‌లో, యంపిఆర్‌లో అలాగే, ఆంధ్రా రెస్టు హౌసులో సుమారు 2 వేల మంది బాబా ప్రేమికులకు బస ఏర్పాటు చేసినట్లు సమాచారం.
ఆంధ్రా రెస్టు హౌసు వసతి విషయంలో వృద్ధులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.
జూలై 9, 10 తేదీలలో ప్రేమికులందరికీ బాబా సమాధికి తీసుకు వెళ్ళేందుకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించారు. తీవ్ర నీటి ఎద్దడి వున్నా మంచినీటి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి, విచ్చేసిన సుమారు 200 మంది బాబా ప్రేమికులకు నిరంతర నీటి సరఫరా వుండేలా, ఎలాంటటి అసౌకర్యం లేకుండా, శ్రీ యాతం వారి కుటుంబ సభ్యులు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారు.
మౌన వార్షికోత్సవానికై మెహెరాబాద్ వచ్చిన తెలుగువారు జూలై 13 తర్వాత తమ స్వగ్రామాలకు తిరుగు ప్రయాణమయ్యారు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము.

మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

## జీవిత సభ్యతం

**2015 జూన్-జూలై నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | జూన్ | ఇ.ఎన్. మూర్తి, చౌడవరం, విశాఖపట్నం | రూ. 1000.00 |
| 2. | జూన్ | ఎస్. జ్ఞానేశ్వర్ సురేష్, హైదరాబాద్ | రూ. 1000.00 |
| 3. | జూన్ | బాలగోపాల మెహెర్, సత్తుపల్లి | రూ. 1000.00 |
| | | **మొత్తం** | **రూ. 3000.00** |

# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 173201000027973.**

**IFSC CODE: IOBA 0001732.**

## మా అడ్రస్:

ఎడిటర్, మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్,
యాప్రాల్, ప్లాట్ నెం.32,
జె.జె. నగర్ కాలనీ పోస్టు,
సికింద్రాబాద్-500087.
ఫోన్: 99595-53218.
**email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D. Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2014-2016, **Dt.06-01-2014,** Date of Publication 17th of every month